

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | బుధవారం | 14-10-2026 | సంపుటి: 3 | సంచిక: 250 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | WEDNESDAY | 14-10-2026 | VOLUME : 3 | ISSUE : 250 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




# దేశమంతా నిరసన వేదిక అవుతుంది

- జంతర్ మంతర్ వద్ద మళ్లీ ఉద్రిక్తతలు
- జాతీయ పతాకంతో జంతర్మంతర్ లోకి ప్రవేశించిన సీజేపీ కార్యకర్తలు
- సీజేపీ ముఖ్య నాయకుల నిర్బంధం
- ఇండి కూటమి పిటిషన్పై 14 అభ్యంతరాలు
- రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రదర్శనపై రెండు ఎఫ్ఐఆర్ లు
- మహిళా జర్నలిస్టులపై దాడుల ఆరోపణలపై సుప్రీంకోర్టు స్పందన
- నిరసన హక్కుపై ఢిల్లీ హైకోర్టులో విచారణ

4

## దేశంలో నియంతృత్వ ధోరణి

- తప్పు చేయనప్పుడు పాలకులు దేనికి భయపడుతున్నారు
- న్యాయవాదులను కలవనివ్వకుండా పోలీసులు బెదిరిస్తున్నారు



4

# సింగరేణి కార్మికులు, ఉద్యోగులకు దసరా కానుక

- ఒక్కొక్కరికి రూ.1,53,912 లాభాల్లో వాటా
- 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి
- సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం
- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం
- కార్మికుల సమస్యల పరిష్కారానికి మానవీయ దృక్పథం
- సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాక్ లు
- మీడియాతో ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్, అక్టోబర్ 13:**

సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ?ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం మాట్లాడుతూ మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ నిర్ణయంతో

మిగతా 2వ పేజీలో..

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలి

- వ్యవసాయం, గృహాలు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా
- కోల్ ఇండియా నుంచి అదనపు బొగ్గు కొనుగోలు చేయండి
- బొగ్గు కొనుగోలుకు నిధుల కొరత లేదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



2

## 2029లో రాహుల్‌కు ఘోర పరాజయం

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా
- ఈవీఎంలపై కాంగ్రెస్ ఆరోపణలు అబద్ధాలంటూ విమర్శ
- బ్యాలెట్ పేపర్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలవలేదని వ్యాఖ్య
- ఎస్ఐఆర్‌పై ఆరోపణలు మాని ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు
- గుజరాత్‌లో 41 ఏళ్లుగా కాంగ్రెస్ గెలవలేదని గుర్తుచేసిన కేంద్ర మంత్రి



4

# రైతు డిస్కమ్ పేరుతో ఉచిత విద్యుత్తుకు ఎసరు



- రైతు డిస్కమ్ ను వ్యతిరేకిస్తున్నాం
- జీవోను తక్షణం ఉపసంహరించుకోవాలి
- రైతన్నకు ఉరి వేసేందుకు కాంగ్రెస్ కుట్ర ఇది
- బీఆర్ఎస్ దీన్ని సహించదు
- బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

**హైదరాబాద్, అక్టోబర్ 13:**

ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సహా ఇతర రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు, సామాజికవేత్తలు, రైతులు లేవనెత్తుతున్న అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ రైతు డిస్కమ్ ఏర్పాటు చేస్తూ జీవో17 జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. మంగళవారం

మిగతా 2వ పేజీలో..

## కేంద్రీకృత పీఎంయూ టెండర్లను రద్దు చేయాలి

- గతంలో మాదిరి పాఠశాలలు ఒక యూనిట్ గా తీసుకోవాలి
- పాత విధానం వల్ల వేలాది చిరు వ్యాపారులకు భద్రత
- 20 శాతం కమిషన్లతో విద్యార్థుల పొట్ట కొడుతున్న వైనం

2

# చినిగిపోని, తడిసినా చెడిపోని మీ సేవ సర్టిఫికెట్లు

- 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లతో కొత్త పేపర్
- ఏళ్ల తరబడి భద్రంగా దాచుకునేలా ప్రత్యేక తయారీ
- మీ సేవలో జారీ చేసే సర్టిఫికెట్లకు ఇక లామినేషన్ పని లేదు
- ప్రారంభించిన ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల

**హైదరాబాద్, అక్టోబర్ 13:**

ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నిక పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మిగతా 3వ పేజీలో..



## లలిత కళా తోరణంలో నానబియ్యం బతుకమ్మ వేడుకలు



2

## ఎన్నికల కమిషనర్లకు పదవులిచ్చింది కాంగ్రెస్ కాదా?

- పీయూష్ గోయల్
- రాహుల్ గాంధీ ఆరోపణలు నిరాధారమంటూ బీజేపీ ఎదురుదాడి
- మాజీ సీఈసీ ఎంఎస్ గిల్‌కు కేంద్ర మంత్రి పదవి ఇచ్చారని విమర్శ

4



# ఎల్బీనగర్ హయత్‌నగర్ కారిడార్‌కు ఆమోదం

- రాష్ట్రానికి ఐదు రోప్‌వేలు, మూడు ఆర్వోబీలకు ఆమోదం
- కేంద్ర మంత్రి గడ్కరీతో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి భేటీ
- పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై సానుకూల స్పందన
- తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగు
- ఎన్‌హెచ్-65 విస్తరణ పనులు జనవరిలో ప్రారంభిస్తామని హామీ
- హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌పై కొత్త డీపీఆర్‌కు ఆదేశాలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 :**

రాష్ట్రానికి అవసరమైన కీలక రహదారులు, వంతెనలు, ఎలివేటెడ్ కారిడార్లు, రోప్‌వేలు సహా పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో రహదారి కనెక్టివిటీని మెరుగుపరిచి ప్రజల ప్రయాణ కష్టాలను

మిగతా 3వ పేజీలో..



## గ్రామీణ రోడ్ల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత



- హ్యామ్ రోడ్ల పనులను వేగవంతం చేయాలి
- నాణ్యతలో రాజీ పడొద్దు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క

3

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు

# అప్రమత్తంగా ఉండాలి

**హైదరాబాద్, అక్టోబర్ 13 :**

ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎల్‌నినోతో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో విద్యుత్ డిమాండ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రజాభవన్‌లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం ఆకస్మిక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ అవసరాలు, సరఫరా సంసిద్ధత, బొగ్గు లభ్యత, అవసరమైన వనరుల సమీకరణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వాతావరణ పరిస్థితుల కారణంగా రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ వినియోగం అధికమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ముందస్తు ప్రణాళికతో వ్యవహరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వ్యవసాయానికి, గృహావసరాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డిమాండ్ పెరిగినప్పటికీ సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పడకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యుత్ సరఫరా సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని భట్టి హామీ ఇచ్చారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు నిల్వలను తగిన స్థాయిలో అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైతే కోల్ ఇండియా నుంచి అదనంగా బొగ్గును కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. బొగ్గు కొనుగోలుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ సహకారాన్ని సమర్థంగా వినియోగించుకుని, రాష్ట్రంలోని ఏ రంగానికీ విద్యుత్ కొరత కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని పేర్కొంటూ మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ ముందస్తు సన్నద్ధతతో వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. కాన్ఫరెన్స్‌లో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లలిత కళా తోరణంలో నానబియ్యం

# బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్, అక్టోబర్ 13 :**

రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న లలిత కళా తోరణంలో నానబియ్యం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలంగాణ సమృద్ధమైన పుష్ప, సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించింది. మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం భక్తి, ప్రకృతి ప్రేమ, సామాజిక ఐక్యత స్ఫూర్తిని ప్రతిబింబించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు కూడా వేడుకల్లో పాల్గొని ఉత్సవ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించి, ప్రోత్సహించడంతోపాటు వాటిని రాష్ట్ర పర్యాటక అనుభవంలో అంతర్భాగంగా ప్రదర్శించేందుకు పర్యాటక శాఖ 2026 ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు ఈ వేడుకలను నిర్వహిస్తోంది.

## రాజ్యాంగ వ్యవస్థలను

# బెదిరిస్తున్న కాంగ్రెస్

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**
- **సుప్రీంకోర్టుపై కాంగ్రెస్, రాహుల్ వైఖరిని ఖండించిన న్యాయవాదులు**
- **హైకోర్టు బార్ కౌన్సిల్ గేట్ వద్ద న్యాయవాదుల భారీ నిరసన**

**హైదరాబాద్, అక్టోబర్ 13 :**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ శ్రేణులు సుప్రీంకోర్టు వద్ద సోమవారం ప్రదర్శించిన నాటకీయ వైఖరిని యావత్ దేశ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. భారత న్యాయవ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసాన్ని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీసేలా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సాగిస్తున్న కుట్రలను నిరసిస్తూ హైదరాబాద్‌లోని హైకోర్టు బార్ కౌన్సిల్ గేట్ వద్ద న్యాయవాదులు మంగళవారం చేపట్టిన భారీ నిరసన ప్రదర్శనలో ఆయన ఒక న్యాయవాదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన న్యాయవ్యవస్థ స్వతంత్రతను, రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడేందుకు న్యాయవాద లోకమంతా ఏకతాటిపైకి వచ్చిందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ), రాష్ట్రపతి వ్యవస్థ వంటి అత్యున్నత రాజ్యాంగ సంస్థలపై రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరికీ గౌరవం, ఆదరణ, విశ్వాసం ఉండాలని హితవు పలికారు. సుప్రీంకోర్టు జడ్జిల అపాయింట్‌మెంట్ అడిగి రాజకీయ మెమొరాండాలు ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని రాహుల్ గాంధీని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో పేరుమోసిన సీనియర్ న్యాయవాదులు ఉన్నప్పటికీ న్యాయస్థానాల్లో పిటిషన్లు ఎలా దాఖలు చేయాలో రాహుల్‌కు కనీస సలహా కూడా ఇవ్వకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కోర్టుల వద్ద ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తూ రాజ్యాంగ వ్యవస్థలను అప్రతిష్ఠపాలు చేసే సంస్కృతిని సమాజం ఎన్నటికీ హర్షించబోదని రామచందర్‌రావు తేల్చిచెప్పారు. మరోవైపు భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను లక్ష్యంగా చేసుకుని కేరళం కాంగ్రెస్ అధికారికంగా పోస్టులు పెడుతూ సీజేఐ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం న్యాయవ్యవస్థపై సాగిస్తున్న ప్రత్యక్ష దాడి అని మండిపడ్డారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా మాట్లాడితే బంగ్లాదేశ్‌లో జమాతే ఇస్లామీ ర్యాలీలు తీయడం వెనుక దాగి ఉన్న శక్తులెవరో దేశ ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. గతంలో అనేకసార్లు కోర్టుల్లో క్షమాపణలు చెప్పిన చరిత్ర కలిగిన రాహుల్‌కు న్యాయ వ్యవస్థ అన్నా, న్యాయవాదులు అన్నా, ప్రజాస్వామ్య విలువలు అన్నా ఎలాంటి గౌరవం లేదని విమర్శించారు. 'సర్' ద్వారా 13 కోట్ల ఓట్లను అక్రమంగా తొలగించారంటూ కాంగ్రెస్ నేతలు అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలకు బీజేపీ తరఫున సవాల్ విసిరామని, దమ్ముంటే ఆధారాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశిత రాజ్యాంగ నిబంధనల ప్రకారమే ఓట్ల నమోదు, తొలగింపు ప్రక్రియ జరుగుతుందని, ఒక్క ఓటు కూడా చట్టవిరుద్ధంగా తొలగించలేదని తేల్చిచెప్పారు. అసత్య ప్రచారాలను మానుకోకపోతే ప్రజలే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని రామచందర్‌రావు హెచ్చరించారు.



# సింగరేణి కార్మికులు, ఉద్యోగులకు దసరా కానుక

మొదటిపేజీ తరువాయి

ప్రయోజనం పొందనున్నారని, 29717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే 596 కోట్ల రూపాయలను లాభాల వాటాగా కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ అందించామని, ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు.

**సొంత ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ**

సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలి. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని" సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని తెలిపారు. సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్ఠంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని, మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సేఫ్టీ కిట్స్ తప్పనిసరిగా పంపిణీ చేయాలని, కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదన్నారు. సింగరేణి ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగానే కార్మికుల పెర్క్స్, అలవెన్స్‌లపై ఆదాయపన్నును కూడా సంస్థ తరఫున ప్రభుత్వానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు వెల్లడించారు. బొగ్గు గనులు, ఓవర్‌బర్డెన్ డంప్‌ల దుమ్ము వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రతి గ్రామానికి వెళ్లి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్మికులతో పాటు వారి కుటుంబాలు, స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. అధికారులకు పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ)ను చెల్లించేలా యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలని సూచించారు. ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలతోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సత్తుపల్లి, భూపాలపల్లి నియోజకవర్గాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తామన్నారు.

**కొత్త బ్లాక్‌లను సాధించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం**

గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాక్‌లను అదనంగా సాధించడంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సుమారు 141 బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియలో సింగరేణి పాల్గొనే అవకాశాన్ని వినియోగించుకోలేదని, దీంతో సంస్థ వ్యాపార విస్తరణకు ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ ఏడాది లాభాలు తగ్గడానికి ఇవే కారణమన్నారు. దాదాపు 14 బ్లాక్‌లు మూతపడిన నేపథ్యంలో వాటి స్థానంలో కొత్త బ్లాక్‌లను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తమ ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనపై దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. తాడిచెర్ల2, కోయగూడెం బ్లాక్ -3, మణుగూరు పీకే ఓసీ2 డిప్ సైడ్ బ్లాక్, నైని వంటి బ్లాక్‌లను ప్రస్తావిస్తూ, కొత్త బ్లాక్‌ల సాధనతో పాటు సంస్థ వ్యాపారాన్ని విస్తరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మహానది, కోల్ ఇండియా, వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ వంటి సంస్థల నుంచి బొగ్గు సరఫరా అవుతోందని, ప్రైవేటు సంస్థలు కూడా తక్కువ ధరలకు బొగ్గును అందిస్తున్నాయని వివరించారు. సింగరేణి బొగ్గు ధరలు అధికంగా ఉండటంతో కొన్ని సంస్థలు ఇతర వనరుల నుంచి బొగ్గు కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మార్కెట్ ధరలకు అనుగుణంగా . ధరలను సర్దుబాటు చేయకపోతే బొగ్గు కొనుగోలుదారులను కోల్పోయే ప్రమాదం ఉందని, తద్వారా సంస్థ ఆదాయం మరింత తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూనే మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.

**మూడేళ్లలో సుమారు రూ.27 వేల కోట్ల బకాయిలు**

సింగరేణికి విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిల అంశాన్ని కూడా భట్టి విక్రమార్క ప్రస్తావించారు. గత పదేళ్లలో సుమారు రూ.29 వేల కోట్ల బకాయిలు పేరుకుపోగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడేళ్లలో సుమారు రూ.27 వేల కోట్ల బకాయిలు ఉన్నట్లు వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన మొత్తాలను క్రమంగా చెల్లించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్**

**– మంత్రి శ్రీధర్‌బాబు**

సింగరేణి సంస్థను పదేళ్ల పాటు అధికారంలో ఉండి నిర్వీర్యం చేసి, భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి పరిష్కరించలేని సమస్యలను ప్రతిపక్షంలో ఉండి ఎలా పరిష్కరిస్తారో మాజీ మంత్రి హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సంస్థకు చేసిన మేలేమిటో, కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించలేకపోయిందో ముందుగా పోరుబాటలో వివరించాలని శ్రీధర్‌బాబు సూచించారు. కార్మికుల సమస్యలపై ఇప్పుడు ఆందోళనలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు.. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు స్పందించలేదో ప్రజలకు చెప్పాలని అన్నారు. మారుపేర్ల సమస్యను పదేళ్ల పాలనలో ఎందుకు పరిష్కరించలేకపోయారని ప్రశ్నించారు. సింగరేణి సంస్థను కాపాడటంతో పాటు కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మంత్రి తెలిపారు. కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. శాశ్వత ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థలను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు అవసరమైన శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు ప్రేం సాగర్ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కోరం కనకయ్య, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, మాలోతు రాందాస్ నాయక్, గండ్ర సత్యనారాయణ రావు, విజయరామారావు, ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, లాభాల వాటాను ప్రకటించడం పట్ల ఎమ్మెల్యేలు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులను శాలువా కప్పి సత్కరించారు.

# రైతు డిస్కమ్ పేరుతో ఉచిత విద్యుత్తుకు ఎసరు

మొదటిపేజీ తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతు డిస్కమ్ ఏర్పాటు జీవో జారీ కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనమన్నారు. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, రైతు మెడకు ఉరేసేందుకేనా ఈ కుట్ర? వ్యవసాయానికి, గృహాలకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు రైతు డిస్కమ్ పేరుతో మరో డ్రామాకు తెరతీయడం సిగ్గుచేటు. రైతు డిస్కమ్ ఏర్పాటు వల్ల రైతులకు ఒరిగే ప్రయోజనం ఏమిటి? రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఈ నిర్ణయం ఎలా దోహదపడుతుందో చెప్పకుండా మొండిగా వ్యవహరించడం దుర్మార్గం. సర్కార్ నిర్వాకంతో అన్నదాత మరింత ఇబ్బందుల్లో కూరుకుపోతాడన్నారు. ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్స్ కాలిపోతే దిక్కు లేదు..రేపు రైతు డిస్కం తో మరింత ఇబ్బందులు తలెత్తే పరిస్థితి. రైతు మెడకు రైతు డిస్కం ఉచ్చు..ఉచిత విద్యుత్‌పై చేతులెత్తేసేందుకే సర్కార్ కొత్త ఎత్తుగడ అని విమర్శించారు. పంటలు ఎండి రైతు కన్నీరు పెడుతుంటే.. డిస్కంల పేరిట రేవంత్ సర్కార్ రాజకీయ చదరంగం ఆడుతున్నది. జీవో ప్రకారం కొత్త డిస్కమ్ పరిధిలోకి 30,60,861 వ్యవసాయ కనెక్షన్లు, 512 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ, మిషన్ భగీరథ.. మొత్తంగా 30,62,853 కనెక్షన్లు రైతు డిస్కం కి బదిలీ చేసారు. ఇంత భారీ వ్యవస్థ నిర్వహణ కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా సాధ్యం అవుతుంది? కేవలం 25శాతం థర్మల్ పవర్ అలకేషన్ తో రైతులకు సాగు, ప్రజలకు తాగు నీళ్లకు అవసరం అయ్యే భారీ విద్యుత్ వ్యవస్థ ఎలా నడుస్తుంది? 6,15,651 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, 2.51 లక్షల సర్క్యూట్ కిలోమీటర్ల వ్యవసాయ ఎల్‌టీ లైన్లు.. వీటి నిర్వహణకు సరిపడా సిబ్బంది లేకపోతే రైతుల కష్టాలకు ఎవరు బాధ్యత వహిస్తారు? రాష్ట్ర విద్యుత్ కేటాయింపుల్లో ఇప్పటికీ 53.28 శాతం థర్మల్ విద్యుత్తే ఉంది. సౌర విద్యుత్తు వాటా 35.31 శాతం మాత్రమే. ఇందులో థర్మల్ 25%, సోలార్ 58%, హైడల్ మొత్తంగా 100% రైతు డిస్కమ్ కు కేటాయించారు.పగటి పూట మాత్రమే సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయితే, రాత్రి పూట ఉండదు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పే ప్రభుత్వం.. పగటిపూట మాత్రమే విద్యుత్ ఇచ్చి, రాత్రివేళ రైతులను చీకట్లోకి నెట్టబోతోందా? 2325 మెగావాట్ల హైడల్ (జల విద్యుత్) పవర్ మొత్తం రైతు డిస్కమ్‌కే కేటాయించారు. కానీ ఈ హైడల్ పవర్ సాంకేతికంగా ఏడాదిలో కేవలం 34 నెలలు మాత్రమే అందుబాటులో ఉంటుంది. అంటే మిగతా 8 నెలలు రైతు డిస్కమ్‌కి ఈ విద్యుత్ అందుబాటులో ఉండదు. అప్పుడు ఎలా నిర్వహిస్తారు?కొత్త డిస్కమ్‌కు భారీ రుణాలు, బకాయిలను కేటాయిస్తూ.. దాని ఆర్థిక స్థిరత్వంపై ప్రభుత్వం ఏం భరోసా ఇస్తోంది? ఈ అప్పుల భారం చివరకు రైతులపై పడేయాలని చూస్తున్నారా? రైతు డిస్కమ్ పేరుతో వ్యవసాయ విద్యుత్ బాధ్యతలను వేరుచేసి, రేపు నష్టాల సాకుతో రైతులపై ఆంక్షలు విధించే ప్రమాదం లేదా?రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగుతుందని, 24 గంటల సరఫరాలో ఎలాంటి కోతలు ఉండవని ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వగలదా? రైతుల అనుమానాలను నివృత్తి చేయకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లడం కుదరదని హెచ్చరించారు. సంస్థ ఏర్పాటుతో అదనపు పరిపాలనా ఖర్చులు ఎంత? ఆ ఖర్చులను ఎవరు భరిస్తారు? ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల బదిలీపై పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం ఎందుకు చేయలేదు?రైతుల పేరుతో డిస్కమ్ ఏర్పాటు చేయడం గొప్ప కాదు.. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం ముఖ్యం. సంస్థల పేర్లు మార్చడం, కొత్త సంస్థలు ఏర్పాటు చేయడం కాదు.. రైతుల విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్

# కేంద్రీకృత పీఎంయూ టెండర్లను రద్దు చేయాలి

**హైదరాబాద్, అక్టోబర్ 13 :**

రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో నిత్యావసర సరుకుల సరఫరా కోసం ప్రభుత్వం చేపట్టిన కేంద్రీకృత పీఎంయూ టెండర్లను తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు హరీశ్ రావును కలిసి, ప్రభుత్వం మార్చిన టెండర్ నిబంధనల వల్ల వేలమంది స్థానిక వెండర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను విన్న అనంతరం హరీశ్ రావు స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గురుకులాలను చిన్నచూపు చూస్తూ పేద విద్యార్థులకు పెట్టే భోజనంపై కూడా కక్కుర్తి పడుతూ, రూ.800 కోట్ల టెండర్లలో కమీషన్ల దందా నడుపుతోందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. గురుకులాల్లో పేద విద్యార్థులకు ఇచ్చే స్కూల్ యూనిఫాంలు, నోట్ బుక్కులు, ట్రంక్ పెట్టెల ఇతర వస్తువుల కొనుగోళ్ల టెండర్లలో దాదాపు రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని గతంలోనే తాము ఆధారాలతో సహా నిరూపించామని హరీశ్రావు గుర్తుచేశారు. ఆ దోపిడీతో కూడా కాంగ్రెస్ పాలకుల కడుపు నిండలేదని.. ఇప్పుడు చివరకు పేద విద్యార్థుల కడుపునింపే నిత్యావసర సరుకులపైనా 20 శాతం కమీషన్లు దండుకోవాలని చూడడం వీరి కక్కుర్తికి నిదర్శనం అని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,023 గురుకులాలు, 3 వేలకు పైగా సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు గతంలో పాఠశాలను యూనిట్‌గా తీసుకుని స్థానిక వ్యాపారులు సరుకులు సరఫరా చేసేవారని గుర్తుచేశారు. అయితే స్థానిక వెండర్లను తప్పించేందుకు జీవో 17 పేరుతో మొదట జిల్లా యూనిట్ అని, ఆ తర్వాత రూ. 3 కోట్ల నుంచి రూ. 5 కోట్ల భారీ ఈఎండీలు పెట్టి వారిని పోటీ లేకుండా చేశారని ఆక్షేపించారు. వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించినా లెక్క చేయకుండా, ఇప్పుడు మొత్తం రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చేసి పీఎంయూ విధానం ద్వారా రూ. 800 కోట్ల కాంట్రాక్టును ఒకే వ్యక్తికి, అదీ గతంలో బ్లాక్‌లిస్టులో పెట్టిన సంస్థకు అప్పగించడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయని ఆరోపించారు. గతంలో నిబంధనల ఉల్లంఘన కారణంగా సివిల్ సప్లైస్‌లో రూ. 65 కోట్ల డిపాజిట్ జప్తునకు గురై బ్లాక్‌లిస్టులో ఉన్న నాకాఫ్ సంస్థకు, అలాగే ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో నిషేధానికి గురైన కంపెనీకి ఈ టెండర్‌ను ఎలా కట్టబెడతారని హరీశ్ రావు ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం సబ్‌కాంట్రాక్టులకు తావులేకపోయినా తెరవెనుక 12 మందికి సబ్ కాంట్రాక్టులు, అక్కడి నుంచి 33 జిల్లాలకు పంపకాలు చేసి ప్రతి జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున ఏకంగా రూ.66 కోట్ల గుడ్‌విల్, ప్రతినెల బిల్లుల్లో 20 శాతం కమీషన్ల ఒప్పందం కుదుర్చుకున్నారని పత్రికా కథనాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. అమీర్‌పేటలోని ప్రైవేట్ కార్యాలయం కేంద్రంగా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి చక్రం తిప్పుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గతంలో ఇదే కాంట్రాక్టర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సరిగ్గా ఇదే కేంద్రీకృత విధానాన్ని అమలు చేయాలని చూశారని హరీశ్ రావు గుర్తుచేశారు. అక్కడ మూడు నెలలు నడిపిన తర్వాత ఈ విధానం ఆచరణ సాధ్యం కాదని తేలడం, సదరు కాంట్రాక్టర్‌పై తీవ్ర ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో అక్కడి ప్రభుత్వమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే ఆ టెండర్‌ను రద్దు చేసి, తిరిగి పాత పద్ధతిలోనే స్థానిక ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. పక్క రాష్ట్రంలో అట్టర్‌ఫ్లాప్ అయి, లోపభూయిష్టమని తేలి రద్దు చేసిన విధానాన్ని.. ఇప్పుడు ఎవరి స్వలాభం కోసం, ఎవరి జేబులు నింపడానికి తెలంగాణలో బలవంతంగా అమలు చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ స్వార్థ ప్రయోజనాలు, కమీషన్ల కక్కుర్తి కోసం పేద విద్యార్థుల కడుపు ఎందుకు కొడతారని నిలదీశారు. స్థానిక వెండర్లు సప్లై చేసే సాధారణ రేట్ల కంటే 35 నుంచి 45 శాతం అధిక ధరలకు టెండర్లను ఖరారు చేశారని, ప్రభుత్వం నిర్ణయించిన ఛార్జీల కంటే ఎక్కువకు కాంట్రాక్టు ఇస్తే విద్యార్థులకు కడుపునిండా అన్నం పెట్టే పరిస్థితి ఎక్కడుంటుందని నిలదీశారు. జూన్ నుంచే సరుకులు ఇవ్వాల్సిన సదరు సంస్థ ఇప్పటివరకు సరఫరా చేయలేకపోయిందని, హాస్టళ్ల ప్రిన్సిపాళ్లు పాత లోకల్ వెండర్లను బతిమిలాడి మూడు నెలలు సరుకులు తెప్పించుకున్నారని చెప్పారు. దసరా పండుగ సెలవులకు ముందు రాష్ట్రంలోని దాదాపు 4 వేల హాస్టళ్లలో కేవలం 280 కేంద్రాలకే నామమాత్రంగా సరుకులు పంపారని, అవి కూడా ఎలాంటి బ్రాండ్, బిల్లు, ఎక్స్‌పైరీ డేట్ లేని అత్యంత నాసిరకం వస్తువులని ఆగ్రహం వ్యక్తం చేశారు.అందుకే ప్రభుత్వం వెంటనే మొండివైఖరి వీడి, కమీషన్ల కోసం తెచ్చిన ఈ కేంద్రీకృత పీఎంయూ టెండర్లను రద్దు చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. గతంలో అమలులో ఉన్న విధంగా డిస్ట్రిక్ట్ పర్చేస్ కమిటీ ద్వారా, పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి స్థానిక వెండర్లకే నిత్యావసర సరుకుల సరఫరా బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. దీనిపై ఆధారపడి బతుకుతున్న వేలాది కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయని, అంతేకాకుండా స్థానికంగా జవాబుదారీతనం పెరిగి పిల్లలకు నాణ్యమైన ఆహారం అందుతుందని పేర్కొన్నారు. పేద విద్యార్థుల ఆరోగ్యం, చిరు వ్యాపారుల పొట్టకొట్టే ఈ అవినీతి నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, బాధిత కుటుంబాల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు.

# ఎల్బీనగర్ హయత్‌నగర్ కారిడార్‌కు ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

తగ్గించడంతోపాటు రాష్ట్ర ఆర్థిక, పర్యాటక అభివృద్ధికి దోహదపడే పలు ప్రతిపాదనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై గడ్కరీ సానుకూలంగా స్పందించి పలు ప్రాజెక్టులకు ఆమోదం తెలపడంతోపాటు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లో వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాల్లో ఒకటైన ఎల్బీనగర్‌హయత్‌నగర్ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. ఈ మార్గంతోపాటు పరిసర ప్రాంతాల్లోని సుమారు 54 కాలనీల్లో 10 లక్షల మందికిపైగా నివసిస్తున్నారని, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నిత్యం ప్రయాణించే ఈ మార్గంలో ట్రాఫిక్‌తోపాటు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని మంత్రి కోమటిరెడ్డి నితిన్ గడ్కరీకి వివరించారు. ఈ మార్గంలో ప్రమాదాలు, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలుపగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి వార్షిక ప్లాన్‌లో చేర్చి ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గడంతోపాటు ప్రయాణ సమయం ఆదా కానుంది. హైదరాబాద్‌విజయవాడ ఎన్‌హెచ్ 65 రహదారిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలపై పలు సందర్భాల్లో కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకెళ్లిన అంశాలను గుర్తు చేశారు. 17 బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఫ్లైఓవర్లు నిర్మాణం జరుగుతున్నా ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ రహదారిపై ట్రాఫిక్ లోడ్ విపరీతంగా పెరిగిందని, హైదరాబాద్‌విజయవాడమచిలీపట్నం ఎన్‌హెచ్ 65 6G2 లేన్ల విస్తరణ పనులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడించి త్వరగా చేపట్టాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా, వాణిజ్య కార్యకలాపాలకు కీలకమైన ఈ రహదారి విస్తరణ పనులకు నవంబర్‌లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి 2027 జనవరిలో పనులు ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

**సోమశిల వద్ద కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం**

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రోడ్డు అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసేలా ఎన్‌హెచ్ 167కెపై కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన కోసం మంత్రి చేసిన ప్రతిపాదనకు కేంద్ర మంత్రి అంగీకారం తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలో సోమశిల నుంచి సంగమేశ్వర వరకు నిర్మించే ఈ బ్రిడ్జి ద్వారా తిరుపతి వెళ్లే వారికి సుమారు 80కి.మీ దూరం తగ్గి దాదాపు 3 గంటల ప్రయాణ సమయం తగ్గుతుందని మంత్రి వివరించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సోమశిల ఆలయం వద్ద పర్యాటక రంగం అభివృద్ధి చెంది తెలంగాణలో ఒక మైలురాయిగా నిలవనుందని మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మంత్రి కోమటిరెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. పర్యాటకం అభివృద్ధి చెందడంతో స్థానికంగా ఉద్యోగావకాశాలు మెరుగుపడనున్నాయని, ఆర్థిక కార్యకలాపాలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని తెలిపారు. హైదరాబాద్‌శ్రీశైలం ఎన్‌హెచ్ 765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**పర్యాటక రంగానికి రోప్‌వేలతో కొత్త ఊతం**

తెలంగాణలో పర్యాటక అభివృద్ధికి, ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు సులభంగా చేరుకునేందుకు పర్వతమాల పథకం కింద ఐదు రోప్‌వేల ఏర్పాటుకు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు. దీనివల్ల పర్యాటకులకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు ఆయా ప్రాంతాల్లో స్థానిక ఉపాధి, ఆర్థిక కార్యకలాపాలకు ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది. హైదరాబాద్‌అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ ప్రాజెక్టు ముందుకు సాగితే రెండు రాష్ట్రాల మధ్య రవాణా మరింత మెరుగుపడనుంది.

**రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఇబ్బందులకు పరిష్కారం**

సేతు బంధన్ పథకం కింద తెలంగాణలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల(ఆర్వోబీ) నిర్మాణానికి కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని, 34 రహదారి పనులకు సీఆర్ఐఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన నితిన్ గడ్కరీ అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పుల్లూరుఅలంపూర్‌జట్రపోలుపెంట్లవెల్లికొల్లాపూర్‌లింగాలఅచ్చంపేటడిండిదేవరకొండమల్లేపల్లినల్గొండ రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనను మంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రతిపాదనపై కూడా నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

**హైదరాబాద్‌లో ఐఆర్‌సీ సమావేశాలకు గడ్కరీని ఆహ్వానించిన మంత్రి**

నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి వెంకటరెడ్డి కేంద్ర మంత్రిని ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన ఆయన కార్యక్రమానికి హాజరవుతానని తెలిపారు. సమావేశంలో ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంవోఆర్‌టీహెచ్ అధికారులు, రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.

# పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు

- **చెరువులు, కుంటల శిఖం భూముల్లో గ్రాసం సాగు**
- **45 రోజుల్లో అందుబాటులోకి వచ్చేలా యుద్ధప్రాతిపదికన చర్యలు**
- **నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాలకు**



**హైదరాబాద్, అక్టోబర్ 13 :**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి పశుగ్రాసం కొరత ఏర్పడే పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. పశువులకు అవసరమైన గ్రాసాన్ని అందుబాటులో ఉంచడంతోపాటు మూగజీవాలకు నీటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా నీటి లభ్యత ఉన్న చెరువులు, కుంటల శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు చేయాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి 45 రోజుల్లో పశుగ్రాసం అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. శిఖం భూములను గుర్తించి ఒక్కో ప్రాంతంలో ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం సాగు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అనువైన స్థలాలను గుర్తించే బాధ్యతను నీటిపారుదల, కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖకు అప్పగించారు. గుర్తించిన భూముల్లో సాగుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేపట్టి నిర్ణీత గడువులోగా పశుగ్రాసాన్ని అందుబాటులోకి తేవాలని దాన కిషోర్ ఆదేశించారు. పశుగ్రాసం సాగుకు అవసరమైన నిధులను ఉపాధి హామీ పథకం నిధుల నుంచి సమకూర్చనున్నారు. సాగుకు అనువైన, అధిక దిగుబడినిచ్చే సీఎస్‌హెచ్ 24ఎంఎఫ్ రకం పశుగ్రాసాన్ని సాగు చేయాలని నిర్ణయించారు. విత్తనాలను పశుసంవర్ధక శాఖ ఉచితంగా అందించనుంది. దీంతో సాగు ప్రారంభానికి అవసరమైన విత్తనాల ఖర్చు రైతులు, సంబంధిత సంఘాలపై పడకుండా చర్యలు తీసుకోనున్నారు.

**నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాలకు**

పశుగ్రాసం సాగు, పంట సంరక్షణ, నీటి నిర్వహణ వంటి పనులను పర్యవేక్షించే బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. భూముల గుర్తింపు, సాగు ఏర్పాట్లు, విత్తనాల సరఫరా, పంట నిర్వహణ వంటి అంశాల్లో జాప్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకున్నా పశువులకు అవసరమైన మేత కొరత ఏర్పడకుండా ముందుగానే పశుగ్రాసాన్ని సిద్ధం చేసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. నీటి లభ్యత ఉన్న భూములను వినియోగించుకోవడం ద్వారా అందుబాటులో ఉన్న వనరులతోనే పశుగ్రాస ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**మూగజీవాలకు తాగునీటి సదుపాయం**

పశువులకు తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పశువులకు నిరంతరం తాగునీరు అందేలా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పశుగ్రాసం సాగు, నీటి తొట్టెల నిర్మాణం వంటి పనులను సమాంతరంగా చేపట్టనున్నారు. శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతం చేసి, క్షేత్రస్థాయిలో అమలు తీరును పర్యవేక్షించాలని అధికారులు నిర్ణయించారు. పశువుల పోషణకు అవసరమైన పచ్చిమేత, తాగునీరు అందుబాటులో ఉండటం పాడి పరిశ్రమతోపాటు గ్రామీణ కుటుంబాల జీవనోపాధికి కూడా కీలకం. సమావేశంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, పంచాయతీరాజ్ కమీషనర్ దివ్య దేవ రాజన్, నీటిపారుదల, కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖ (ఐ అండ్ సీఏడీ) ఈఎన్‌సీ రమేష్ బాబు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఈఎన్‌సీ మధుసూదన్, వీబీజీ రాంజీ అధికారులు పాల్గొన్నారు.

# పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రూ.204.40 కోట్ల భరోసా

- **32,976మందికి స్కాలర్‌షిప్ నిధుల విడుదల**
- **హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఫీజు బకాయిలకు మరో రూ.14.68 కోట్లు**

**హైదరాబాద్, అక్టోబర్ 13 :**

రాష్ట్రంలోని ఎస్సీ విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 32,976 మంది విద్యార్థులకు మొత్తం రూ.204.40 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన 40 శాతం వాటాగా రూ.101.44 కోట్లు, కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటాగా రూ.102.96 కోట్లు విడుదల చేసినట్లు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కళాశాలల నుంచి అందుతున్న పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అర్హత ఉన్న విద్యార్థులకు దశలవారీగా స్కాలర్‌షిప్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

**విద్యకు అత్యంత ప్రాధాన్యం**

ఆర్థిక పరిస్థితులు కారణంగా ఏ ఒక్క ఎస్సీ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్ ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ సహాయం అందేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

**హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు రూ.14.68 కోట్లు**

ఇదిలా ఉండగా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.14.68 కోట్లను విడుదల చేసింది.

# గ్రామీణ రోడ్ల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత

**హైదరాబాద్, అక్టోబర్ 13 :**

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులకు స్పష్టం చేశారు. ఖైరతాబాద్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ తెలంగాణ స్టేట్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ఇన్‌స్టిట్యూషనల్ స్ట్రెంగ్తెనింగ్ ప్రోగ్రామ్‌కు ఆమె హాజరయ్యారు. హామ్ రోడ్ల విధానంలో టెక్నికల్ షెడ్యూల్, పనుల పరిధి, సాంకేతిక బాధ్యతలు, ఇతర విధివిధానాలపై ఫీల్డ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో పాల్గొని రహదారుల అభివృద్ధి పనుల పురోగతి, లక్ష్యాలు, అమలు తీరుపై దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 7,448 కి.మీకు పైగా హామ్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ఆయన నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోడ్ల నిర్మాణంలో ప్రతి రోజూ విలువైనదేనని, సమయం వృథా కాకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు.

**ప్రజల ప్రాణాలు కాపాడటంలో రోడ్ల పాత్ర కీలకం**

రహదారులు ప్రయాణ సౌకర్యాలు మాత్రమే కాదని, ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్నాయంటూ అత్యవసర సమయంలో అంబులెన్స్ హాస్పిటల్‌కి చేరాలన్నా, గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు అందాలన్నా రహదారులు ఎంతో అవసరమని మంత్రి సీతక్క వివరించారు. గ్రామాల్లో రోడ్ల సౌకర్యం సరిగా లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు అక్కడ పనిచేయడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. పరిశ్రమలు స్థాపించాలన్నా, పెట్టుబడులు రావాలన్నా రవాణా సౌకర్యాలు కీలకమని తెలిపారు. రహదారుల అనుసంధానమే ప్రాంతాల అభివృద్ధికి ప□□నాది అని పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణంలో వేగంతోపాటు నాణ్యతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. పనులు చేపట్టే ఏజెన్సీలతో అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ నాణ్యత లోపించకుండా చూడాలని ఆదేశించారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు పనులు చేపట్టేందుకు అనువైన సమయమంటూ ఈ కాలాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని చెప్పారు. లక్ష్యాలను నిర్దేశించుని సమన్వయంతో పనిచేసి పనులు పూర్తి చేయాలన్నారు.

**గ్రామాల అభివృద్ధే లక్ష్యం**

ప్రజలు నివసించే ప్రాంతాల్లోనే మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో సమాన అభివృద్ధి జరగాలన్నారు. గ్రామాల్లోనే కుటుంబాలు గౌరవంగా, సౌకర్యవంతంగా జీవించే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో ఇంజనీరింగ్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని, తాము నిర్మించిన రోడ్డు, కట్టించిన భవనం చూసినప్పుడు ప్రజలకు ఉపయోగపడే పనిచేశామనే సంతృప్తి ప్రతి ఉద్యోగికి కలగాలని సూచించారు. పంచాయతీ భవనాల నిర్మాణంతోపాటు ఇందిరా మహిళా శక్తి, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్ల విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కాంట్రాక్టులను రద్దు చేసి ఇతర ఏజెన్సీలకు పనులు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిశోర్, ఈఎన్‌సీ జగదీశ్వర్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# చినిగిపోని, తడిసినా చెడిపోని మీ సేవ సర్టిఫికెట్లు

**మొదటిపేజీ తరువాయి**

మంగళవారం ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లు రాజ్ ఠాకూర్, విజయ రమణారరావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టి. రవికిరణ్, అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌లో 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లను పొందుపరిచారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీ, అనధికార నకళ్లను అరికట్టేలా వీటిని రూపొందించారు. భద్రతా కారణాలతో ఈ ఫీచర్ల పూర్తి వివరాలను వెల్లడించడం లేదు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ పేపర్ సులభంగా చినిగిపోదు. నీళ్లు పడినా త్వరగా దెబ్బతినదు. సాధారణ వినియోగం, మడతపెట్టడం, ఎక్కువ కాలం భద్రపరచడం వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది. దీంతో సర్టిఫికెట్లను ఏళ్ల తరబడి మంచి స్థితిలో దాచుకునే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వాటికి లామినేషన్ చేయించాల్సిన అవసరం కూడా తగ్గుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే సర్టిఫికెట్లు ప్రజల జీవితంలో ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. కొన్ని పత్రాలను జీవితాంతం భద్రంగా ఉంచుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి ధ్రువపత్రాలు త్వరగా పాడవకుండా చూడటంతోపాటు వాటి విశ్వసనీయతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యాన్ని మరింత పెంచే దిశగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి వివరించారు. కొత్త సెక్యూరిటీ పేపర్‌తో సర్టిఫికెట్ల మన్నిక పెరగడంతోపాటు నకిలీలను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ ధ్రువపత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 2011 నుంచి మీ సేవ సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పేపర్ స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు దీర్ఘకాలం భద్రపరచాల్సిన ఇతర ప్రభుత్వ పత్రాలకు ఇది ఎంతో ఉపయోగపడనుంది.



# విద్యతోనే సమాజాభివృద్ధి

- **ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ విద్యారంగం**
- **3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంలో భాగస్వాములు కావాలి**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, అక్టోబ ర్ 13 :**

విద్య ద్వారానే సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడం సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ భారీగా నిధులు కేటాయించడంతోపాటు విప్లవాత్మక సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఒక తెలుగు న్యూస్ ఛానల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురువందనంఎడ్యుకేషన్ కాంక్లేవ్ అండ్ టీచర్స్ అవార్డ్స్2026 కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులను ఉన్నతమైన మానవ వనరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు మరింత చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలు అభివృద్ధి సాధించడానికి విద్య కీలకమైన మార్గమని సర్వే గణాంకాలు వెల్లడిస్తున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజాన్ని ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని విద్యారంగ అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

**ఉపాధ్యాయ నియామకాలు.. విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం**

విద్యారంగాన్ని బలోపేతానికి డీఎస్సీ ద్వారా పెద్దఎత్తున ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ల నియామకాలను కూడా పూర్తి చేశామని భట్టి తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన విద్యాబోధన అందించడంతోపాటు విద్యార్థుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. దీనికి అదనంగా వారానికి మూడు రోజులు పాలు లేదా రాగి జావ అందించే కార్యక్రమాన్ని కూడా విస్తరిస్తున్నామని చెప్పారు.

**105 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు**

అంతర్జాతీయ ప్రమాణాలతో, ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేసి నిర్మాణ పనులు వేగవంతం చేసినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రీడలు, మైదానాలు, ఇతర పాఠ్యేతర కార్యక్రమాలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులకు సైతం పాఠశాలల ప్రాంగణాల్లో నివాస సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఉన్నత విద్యారంగ అభివృద్ధిపైనా దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో అవసరమైన నియామకాలు చేపడుతున్నామని చెప్పారు. మహిళా విద్యకు ప్రోత్సాహం అందించేందుకు మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సాంకేతిక విద్యలోనూ సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. ఐటీఐ కళాశాలలను ఆధునికీకరించడంతోపాటు పాలిటెక్నిక్ విద్యను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆధునిక యంత్రాలు, కంప్యూటరైజ్డ్ సాంకేతిక పరిజ్ఞానంపై యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగాలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

**ఉపాధ్యాయుల భాగస్వామ్యంతోనే లక్ష్య సాధన**

విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు భవిష్యత్తులో గేమ్ ఛేంజర్‌గా మారుతాయని భట్టి విశ్వాసం వ్యక్తం చేశారు. 'గురువందనం'లో అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరూ ప్రభుత్వ లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని పేర్కొంటూ 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్య సాధనలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవ రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే టి.హరీష్ రావు, జీ న్యూస్ సీఈవో, ఎడిటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో నియంతృత్వ ధోరణి

- తప్పు చేయనప్పుడు పాలకులు దేనికి భయపడుతున్నారు
- న్యాయవాదులను కలవనివ్వకుండా పోలీసులు బెదిరిస్తున్నారు
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధ్వజం



న్యూఢిల్లీ, అక్టోబర్ 13 :
దేశంలో నియంతృత్వ ధోరణి నడుస్తోందని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాలకులే స్వయంగా రాజ్యాంగ నిబంధనలను విస్మరిస్తూ ప్రతిపక్షాలను, ఉద్యమకారులను అణచివేస్తున్నారని విమర్శించారు. తాము ఎలాంటి తప్పూ చేయ నప్పుడు పాలకులు దేనికి భయపడి ఈ స్థాయిలో నిర్బంధాలు ప్రయోగిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీ నిరసనలకు సంబంధించి దిల్లీలో తమ పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారిని వేర్వేరు చోట్లలో నిర్బంధించారని దీప్కే తెలి పారు. దిల్లీలో అరెస్ట్ చేసిన అనంతరం తమ పార్టీ కీలక నేతలు అశుతోష్, అజింక్య, సౌర వలను ఒకేచోట కాకుండా వేర్వేరు ప్రాంతాల్లో ఉంచినట్లు ఆయన ఆరోపించారు. వారితోపాటు అదుపులోకి తీసుకున్న 11 మంది వలంటీర్లను అజ్ఞాత ప్రాంతానికి తరలించారని ఆరోపించారు. అరెస్టయిన నేతలను కలవడానికి తమ న్యాయవాదులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు పోలీసులు వారిని లోపలికి అనుమతించకుండా అడ్డుకున్నారని దీప్కే ఆరోపించారు. పార్టీకి చెందిన ఇతర సభ్యులను, నాయకులను కూడా అదుపులోకి తీసుకుంటామని పోలీసులు బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలకు భయపడేది లేదని, రాజ్యాంగబద్ధ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# 2029లో రాహుల్‌కు ఘోర పరాజయం తప్పదు: అమిత్ షా

- ఈవీఎంలపై కాంగ్రెస్ ఆరోపణలు అబద్ధాలంటూ విమర్శ
- బ్యాలెట్ పేపర్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలవలేదని వ్యాఖ్య
- ఎస్ఐఆర్‌పై ఆరోపణలు మాని ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు
- గుజరాత్‌లో 41 ఏళ్లుగా కాంగ్రెస్ గెలవలేదని గుర్తుచేసిన కేంద్ర మంత్రి
- పలు రాష్ట్రాల్లో బీజేపీ విజయాలను ప్రస్తావిస్తూ రాహుల్‌పై ఎదురుదాడి



న్యూఢిల్లీ, అక్టోబర్ 13:
ఎన్నికల్లో బీజేపీ విజయాలను ఈవీఎంల అక్రమాలుగా చిత్రీకరిస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 2029 ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఘోర పరాజయానికి సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ తన ఓటమికి ఈవీఎంలను కారణంగా చూపుతోందని, గుజరాత్‌లోని గాంధీనగర్ మున్సిపల్ ఎన్నికలు బ్యాలెట్ పేపర్లతో నిర్వహించినా ఆ పార్టీ గెలవలేకపోయిందని అన్నారు. దీనిని బట్టి కాంగ్రెస్ ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు.

**ఎస్ఐఆర్‌పై విమర్శలకు కౌంటర్**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను అమిత్ షా తప్పుబట్టారు. ఎస్ఐఆర్ 2024 తర్వాతే ప్రారంభమైందని, అంతకుముందు నుంచే కాంగ్రెస్ వరుసగా ఎన్నికల్లో ఓడిపోతోందని ఎద్దేవా చేశారు. పార్టీ నాయకత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించారు. ఎన్నికల్లో బీజేపీ సాధిస్తున్న విజయాలను, ప్రధాని మోదీకి ఉన్న ప్రజాదరణను ఎస్ఐఆర్ అక్రమాలుగా కాంగ్రెస్ భావిస్తోందని విమర్శించారు.

**పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటములను ప్రస్తావిస్తూ..**
త్రిపుర, పశ్చిమబెంగాల్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ దశాబ్దాలుగా అధికారంలోకి రాలేకపోతోందని అమిత్ షా గుర్తుచేశారు. గుజరాత్‌లో కాంగ్రెస్ చివరిసారిగా 41 ఏళ్ల క్రితం విజయం సాధించిందని వ్యాఖ్యానించారు. ఇటీవల పశ్చిమబెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, అస్సాంలో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదని అన్నారు. అస్సాంలోని నౌగావ్‌లోనూ బీజేపీ విజయం సాధించిందని పేర్కొన్నారు. రాజస్థాన్ స్థానిక ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాన్ని రాహుల్ గాంధీ గమనించాలని అమిత్ షా అన్నారు. రాష్ట్రంలో 85 శాతం వార్డుల్లో ఆప్ డిపాజిట్ కోల్పోయిందని పేర్కొన్నారు. త్రిపుర గ్రామ కమిటీ ఎన్నికల్లోనూ బీజేపీ గెలిచిందని గుర్తుచేస్తూ, ఈ ఫలితాల నుంచి కాంగ్రెస్ పాఠాలు నేర్చుకోవాలని వ్యాఖ్యానించారు.

# ఎన్నికల కమిషనర్లకు పదవులిచ్చింది కాంగ్రెస్ కాదా?

- రాహుల్ గాంధీ ఆరోపణలు నిరాధారమంటూ బీజేపీ ఎదురుదాడి
- మాజీ సీఈసీ ఎంఎస్ గిల్‌కు కేంద్ర మంత్రి పదవి ఇచ్చారని విమర్శ

న్యూఢిల్లీ, అక్టోబర్ 13:
ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు నిరసనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో బీజేపీ ఎదురుదాడికి దిగింది. కాంగ్రెస్ గతంలో ఎన్నికల కమిషనర్లకు పదవీ విరమణ అనంతరం రాజకీయ పదవులు కట్టబెట్టిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆరోపించారు. రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలు అవాస్తవమైనవని, నిరాధారమైనవని పేర్కొన్నారు.
మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంఎస్ గిల్‌కు కాంగ్రెస్ హయాంలో కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పించిన విషయాన్ని గోయల్ ప్రస్తావించారు. ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన గిల్ అనంతరం రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు. ఎన్నికల కమిషనర్లకు రాజకీయ పదవులు ఇవ్వడం ద్వారా వారు గతంలో చేసిన పనులకు ప్రతిఫలం అందించినట్లుగా కనిపిస్తోందని విమర్శించారు.

**శేషన్, చావ్లా నియామకాలపైనా ప్రశ్నలు**
మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ పదవీకాలం 1996 డిసెంబరులో ముగిసిన అనంతరం, 1997లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను గవర్నర్‌గా నియమించిందని గోయల్ ఆరోపించారు. ఎన్నికల కమిషనర్లకు పదవీ విరమణ తర్వాత రాజకీయ పదవులు ఇవ్వడంపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లా నియామకాన్ని కూడా బీజేపీ ప్రస్తావించింది. 2005లో ఆయన నియామకంలో అప్పటి ప్రధాని, కేంద్ర ప్రభుత్వ పాత్ర ఉందని గోయల్ పేర్కొన్నారు. కేరళ ప్రధాన ఎన్నికల అధికారిగా పనిచేసిన టికారాం మీనా అనంతరం రాజస్థాన్ కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీలో చేరారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ వ్యవహారంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు, గతంలో ఆ పార్టీ అనుసరించిన వైఖరికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

# దేశమంతా నిరసన వేదిక అవుతుంది

- జంతర్ మంతర్ వద్ద మళ్లీ ఉద్రిక్తతలు
- జాతీయ పతాకంతో జంతర్మంతర్ లోకి ప్రవేశించిన సీజేపీ కార్యకర్తలు
- సీజేపీ ముఖ్య నాయకుల నిర్బంధం
- ఇండి కూటమి పిటిషన్పై 14 అభ్యంతరాలు
- రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రదర్శనపై రెండు ఎఫ్ఐఆర్‌లు
- మహిళా జర్నలిస్టులపై దాడుల ఆరోపణలపై సుప్రీంకోర్టు స్పందన
- నిరసన హక్కుపై దిల్లీ హైకోర్టులో విచారణ

| దిల్లీ | అక్టోబర్ 13:
ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, వోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిలిపివేత డిమాండ్‌తో కొనసాగుతున్న నిరసనలు మంగళవారం మరోసారి ఉద్రిక్తతలకు దారితీశాయి. దిల్లీలోని చారిత్రక జంతర్‌మంతర్‌ను అధికారిక నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించిన మరుసటి రోజే కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు పోలీసు బారికేడ్లను దాటి అక్కడికి చేరుకున్నారు. జాతీయ పతాకాలను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. పోలీసులు సీజేపీ ముఖ్య నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్య షిండే సహా పలువురిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, సోమవారం రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నిర్వహించిన భారీ ప్రదర్శన అనంతరం సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌కు రిజిస్ట్రీ 14 సాంకేతిక, విధానపరమైన అభ్యంతరాలు తెలిపింది. దీంతో మంగళవారం ఆ పిటిషన్‌పై విచారణ జరగలేదు. నిరసనకారులపై పోలీసు చర్యలు, మహిళా జర్నలిస్టుల నిర్బంధం, మెట్రో సేవల నిలిపివేత వంటి అంశాలు మాత్రం న్యాయస్థానాల్లో విచారణకు వచ్చాయి. మంగళవారం ఉదయం జంతర్‌మంతర్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి సీజేపీ కార్యకర్తలు లోపలికి ప్రవేశించారు. జాతీయ పతాకాలు పట్టుకుని నినాదాలు చేశారు. కొందరు కార్యకర్తలు ఇనుప గేటును ఎక్కి లోపలికి చేరుకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యాయి. ఈ సందర్భంగా సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్య షిండేతోపాటు ఇతర కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 20 మంది నిర్బంధానికి గురైనట్లు సీజేపీ వెల్లడించింది అనుమతి లేని ప్రదేశంలో నిరసన చేపట్టేందుకు ప్రయత్నించడంతో పోలీసులు చర్యలు తీసుకున్నట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

**దేశమంతా జంతర్‌మంతర్ అవుతుంది : అభిజీత్ దీప్కే**
సహచరుల నిర్బంధంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రంగా స్పందించారు. జంతర్‌మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించినంత మాత్రాన ప్రజల నిరసనలను అణచివేయలేరని వ్యాఖ్యానించారు. జంతర్‌మంతర్ కేవలం ఒక ప్రదేశం కాదని, అది ప్రజాస్వామ్య నిరసనకు ప్రతీక అని పేర్కొన్నారు. ఇకపై దేశమంతటా జంతర్‌మంతర్‌లాంటి నిరసన వేదికలు ఏర్పడతాయని హెచ్చరించారు. జాతీయ పతాకాన్ని ప్రదర్శించడం నేరమెలా అవుతుందని ప్రశ్నించారు. అదుపులోకి తీసుకున్న కార్యకర్తలకు న్యాయవాదులను సంప్రదించే అవకాశం కల్పించాలని పోలీసులను కోరారు. గతంలో తనను నిర్బంధించినప్పుడు 24 గంటలపాటు న్యాయవాదితో మాట్లాడేందుకు అనుమతించలేదని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు.

**విద్యార్థి సంఘం ప్రదర్శన**
సీజేపీ నాయకుల నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం దిశ విద్యార్థి సంఘం కార్యకర్తలు కన్నాట్ ప్లేస్ నుంచి ప్రదర్శన నిర్వహించారు. సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా తదితరులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జంతర్‌మంతర్‌ను తిరిగి ప్రజల నిరసన వేదికగా గుర్తించాలని కోరారు. యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**రాహుల్ గాంధీ పిటిషన్‌కు 14 అభ్యంతరాలు**
సోమవారం రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా 11 మంది ఇండి కూటమి నాయకులు ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టులో ఉమ్మడి పిటిషన్ దాఖలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ, వోటర్ల తొలగింపుపై ఆడిట్, ఎన్నికల సంఘం అంతర్గత నిర్ణయాలకు సంబంధించిన రికార్డుల సమర్పణ, ఎస్ఐఆర్‌పై తాత్కాలిక నిలుపుదల వంటి ఉపశమనాలను కోరారు. అయితే పిటిషన్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు రిజిస్ట్రీ 14 అభ్యంతరాలు గుర్తించింది. కోర్టు ఫీజులో రూ.220 లోటు, తొమ్మిది మంది పిటిషనర్ల తరఫున అవసరమైన వకాలత్‌నామాలు లేకపోవడం, మల్లికార్జున ఖర్గే గుర్తింపు కార్డు ప్రతిలో స్పష్టత లేకపోవడం, కొన్ని పత్రాల్లో పేజీలు కనిపించకపోవడం తదితర లోపాలను పేర్కొంది. జ్ఞానేశ్ కుమార్‌తోపాటు మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లను వ్యక్తిగత ప్రతివాదులుగా ఎందుకు చేర్చారన్న అంశంపైనా వివరణ కోరింది. ఈ అభ్యంతరాలు పరిష్కరించకపోవడంతో మంగళవారం పిటిషన్ విచారణ జాబితాలో చేరలేదు. లోపాలను సరిదిద్దిన తర్వాత విచారణకు తీసుకుంటామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది..అందువల్ల ఎస్ఐఆర్‌ను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు మంగళవారం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.
ఇండి కూటమి ప్రదర్శనపై రెండు కేసులు
సోమవారం రాహుల్ గాంధీ నేతృత్వంలో నిర్వహించిన ఇండియా కూటమి ప్రదర్శనకు సంబంధించి దిల్లీ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు మంగళవారం వెల్లడైంది. బారాఖంబా రోడ్డు, తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అనుమతి లేకుండా ప్రదర్శన నిర్వహించడం, బారికేడ్లను ధ్వంసం చేయడం, రహదారులపై రాతలు రాయడం వంటి ఆరోపణలను పోలీసులు పేర్కొన్నారు. ఒక ట్రక్కుతో బారికేడ్లకు నష్టం కలిగించినట్లు కూడా ఆరోపించారు. గత పది రోజులుగా జరిగిన నిరసనలకు సంబంధించి దిల్లీలోని వివిధ పోలీస్ స్టేషన్లలో రెండు డజన్లకుపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు, అక్టోబర్ 10 నిరసనల సందర్భంగా 20 మందికిపైగా అరెస్టయి, అనంతరం బెయిల్‌పై విడుదలైనట్లు తెలుస్తోంది.



**మహిళా జర్నలిస్టులపై దాడుల ఆరోపణలు: సుప్రీంకోర్టు స్పందన**
మంగళవారం మరో ముఖ్యమైన పరిణామంగా నిరసనలను కవర్ చేస్తున్న మహిళా జర్నలిస్టులపై పోలీసుల దాడులు, అక్రమ నిర్బంధం జరిగాయన్న ఆరోపణలను సుప్రీంకోర్టు పరిశీలించింది. నెట్‌వర్క్ ఆఫ్ విమెన్ ఇన్ మీడియా, ఇండియా (ఎన్‌డబ్ల్యూఎంఐ) దాఖలు చేసిన పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులను అడ్డుకోవడం, బలవంతంగా తరలించడం, గుర్తింపు కార్డులు చూపించినప్పటికీ నిర్బంధించడం వంటి ఆరోపణలను పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ అంశాలపై వివరణ ఇవ్వడానికి గురువారం, అక్టోబర్ 15న సీనియర్ దిల్లీ పోలీసు అధికారి హాజరుకావాలని ప్రధాన న్యాయమూర్తి కోరారు. పాత్రికేయుల భద్రత, నిరసనల సమయంలో వార్తా సేకరణకు స్వేచ్ఛ, పోలీసుల వ్యవహారశైలికి సంబంధించిన మార్గదర్శకాలను పిటిషనర్లు కోరుతున్నారు.

**నిరసనల కేసుల విచారణ 15కు వాయిదా**
అక్టోబర్ 10 నిరసనల సందర్భంగా మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రాకపోకలకు అంతరాయం, పోలీసు నిర్బంధాలు, ప్రజల స్వేచ్ఛాయుత రాకపోకలపై ఆంక్షలకు సంబంధించిన పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు గురువారం అక్టోబర్ 15కు వాయిదా వేసింది. ధర్మాసనంలోని జస్టిస్ వి. మోహన అనారోగ్యంతో ఉండటంతో విచారణ వాయిదా పడింది. కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, కోర్టు ఆదేశాల అమలుకు సంబంధించిన అఫిడవిట్ సిద్ధంగా ఉందని, మరికొన్ని వివరాలు చేర్చేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ధర్మాసనం అదనపు సమయం మంజూరు చేసింది. ఇది రాహుల్ గాంధీ సంయుక్త పిటిషన్‌కు సంబంధించిన విచారణ కాకుండా, నిరసనలపై పోలీసు ఆంక్షలకు సంబంధించిన ప్రత్యేక విచారణ.

**దిల్లీ హైకోర్టులో నిరసన హక్కుపై విచారణ**
నిరసనల నిర్వహణ, పోలీసుల ఆంక్షలు, జంతర్‌మంతర్‌లో ప్రదర్శనలకు అనుమతి అంశాలపై మంగళవారం దిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ డబ్ల్యూ. సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మల ధర్మాసనం సంబంధిత పిటిషన్లను పరిశీలించింది. అక్టోబర్ 10న జంతర్‌మంతర్, కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో నిరసనకారులపై గుర్తుతెలియని వ్యక్తులు దాడులు చేశారన్న ఆరోపణలపై ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్ స్వతంత్ర విచారణ కోరారు. దాడులకు సంబంధించినవిగా పేర్కొన్న తొమ్మిది వీడియోలను పిటిషన్‌లో ఆధారాలుగా సమర్పించారు. సీసీటీవీ రికార్డులను భద్రపరచాలని కోరారు. అయితే పిటిషన్ విచారణార్హతపై కేంద్ర ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. మూడు వారాల్లో ప్రాథమిక అభ్యంతరాలను సమర్పించేందుకు కోర్టు అవకాశం ఇచ్చింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ నాలుగు వారాల తర్వాత జరగనుంది. మరోవైపు నిరసనల సందర్భంగా బారికేడ్లు, రహదారుల మూసివేత వల్ల రూ.2,000 కోట్ల వ్యాపార నష్టం జరిగిందని వ్యాపార సంఘాలు కోర్టును ఆశ్రయించాయి. నిరసనల నిర్వహణకు సంబంధించిన ఇతర పిటిషన్ల విచారణను హైకోర్టు అక్టోబర్ 16కు వాయిదా వేసింది.

**20 వరకు అదనపు బలగాలు కొనసాగించాలని విజ్ఞప్తి**
దిల్లీలో నిరసనలు మరింత విస్తరించే అవకాశం ఉందన్న అంచనాతో కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన 273 కంపెనీల మోహరింపును అక్టోబర్ 20 వరకు పొడిగించాలని దిల్లీ పోలీసులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోరారు. ఇప్పటికే మొత్తం 301 కంపెనీల మోహరింపునకు అనుమతి ఇచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే వాటిలో కొన్ని కంపెనీలు ఇంకా దిల్లీకి చేరలేదని పేర్కొన్నాయి. జంతర్‌మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం, పార్లమెంట్, ఇండియా గేట్ పరిసరాల్లో కొత్త నిరసనలు జరిగే అవకాశాన్ని పోలీసులు తమ విజ్ఞప్తిలో ప్రస్తావించారు.

**జంతర్‌మంతర్‌ను పునరుద్ధరించాలని ఇండి కూటమి డిమాండ్**
జంతర్‌మంతర్‌ను అధికారిక నిరసన స్థలంగా తిరిగి గుర్తించాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఎన్నికల సంఘం పనితీరును విమర్శిస్తూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్షాలు ఐక్యంగా పోరాడతాయని ప్రకటించారు. రాహుల్ గాంధీ కూడా రాజ్యాంగ పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు కలిసే ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇండియా కూటమి నిరసనలు విజయవంతమయ్యాయని వ్యాఖ్యానించారు.

**గురువారం సుప్రీంకోర్టు విచారణ కీలకం**
మంగళవారం పరిణామాలతో ఎన్నికల సంఘంపై జరుగుతున్న రాజకీయ ఉద్యమానికి న్యాయపరమైన అంశాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాహుల్ గాంధీ ఉమ్మడి పిటిషన్‌లోని 14 అభ్యంతరాలను ప్రతిపక్షాల న్యాయవాదులు ఎప్పుడు పరిష్కరిస్తారన్నది ఒక ముఖ్యమైన ప్రశ్నగా మారింది. అక్టోబర్ 15న నిరసనలపై పోలీసు ఆంక్షలకు సంబంధించిన కేసులు, మహిళా జర్నలిస్టులపై దాడుల ఆరోపణల అంశం సుప్రీంకోర్టు ముందుకు రానున్నాయి. అక్టోబర్ 16న జంతర్‌మంతర్ నిరసనల అనుమతులు, ప్రజల రాకపోకలపై ఆంక్షలకు సంబంధించిన అంశాలను దిల్లీ హైకోర్టు తిరిగి పరిశీలించనుంది. జంతర్‌మంతర్‌ను అధికారిక నిరసన స్థలంగా పునరుద్ధరిస్తారా, సీజేపీ నాయకులపై కొత్తగా కేసులు నమోదు చేస్తారా, ఇండి కూటమి తదుపరి కార్యక్రమం ఏమిటన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# సీఈసీ నిరసనల వేళ ఫేక్ ప్రచారం.. 4 ఎఫ్ఐఆర్‌లు

- నకిలీ వార్తలు వ్యాప్తి చేసిన సోషల్ మీడియా ఖాతాలపై ఢిల్లీ పోలీసుల దర్యాప్తు
- పాకిస్థాన్‌కు చెందిన ఖాతాల పాత్రపై అనుమానాలు
- నిరసనల్లో మరణాలు సంభవించాయంటూ తప్పుడు ప్రచారం
- సుమారు 500 సోషల్ మీడియా పోస్టుల తొలగింపు
- ఇండియా కూటమి మార్చ్‌పైనా రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు



న్యూఢిల్లీ, అక్టోబర్ 13:
ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన నిరసనల నేపథ్యంలో సోషల్ మీడియాలో నకిలీ వార్తలు, తప్పుడు కథనాలు వ్యాప్తి చెందినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసినట్లు అనుమానిస్తున్న ఖాతాలపై ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు సమాచారం. దేశానికి వ్యతిరేకంగా కంటెంట్ సృష్టించడం, ప్రజల్లో ఆందోళన రేకెత్తించడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**పాకిస్థాన్ ఖాతాల పాత్రపై దర్యాప్తు**
ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌కు చెందిన కొన్ని సోషల్ మీడియా ఖాతాలు తప్పుడు కథనాల వ్యాప్తిలో చురుగ్గా వ్యవహరించినట్లు అధికారులు గుర్తించారు. అక్టోబర్ 10న జరిగిన ఎస్ఐఆర్ నిరసనల్లో మరణాలు సంభవించాయంటూ కొన్ని ఖాతాలు ప్రచారం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. భారతీయులుగా నటిస్తూ నకిలీ వీడియోలు, తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేసినట్లు అనుమానిస్తున్నారు. ప్రజల్లో భయాందోళనలు, అశాంతి తలెత్తకుండా ఉండేందుకు సుమారు 500 సోషల్ మీడియా పోస్టులను తొలగించినట్లు అధికారులు వెల్లడించారు.

**నిరసనలపై వేర్వేరు కేసులు**
అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజిత్ దీప్కే, కోకన్వీనర్లు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను ఢిల్లీ పోలీసులు విమానంలో అరెస్టు చేశారు. అనంతరం మరుసటి రోజు షరతులతో విడుదల చేశారు.
మరోవైపు, సోమవారం సుప్రీంకోర్టు వైపు ఇండియా కూటమి నేతలు చేపట్టిన మార్చ్‌పైనా ఢిల్లీ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 163 కింద విధించిన ఆంక్షలను ఉల్లంఘించారనే ఆరోపణలపై ఈ కేసులు నమోదైనట్లు సమాచారం.

# ఎల్లమ్మ ఆలయంలో రామచందర్ రావు ప్రత్యేక పూజలు

హైదరాబాద్, ప్రజాతంత్ర, అక్టోబర్ 13 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయాన్ని మంగళవారం దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మాత ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని, రైతన్నల పంటలు సమృద్ధిగా పండి రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయన శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఖమ్మం రజక వీధిలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారి దర్శనం.. ఘనంగా అన్నదాన కార్యక్రమం**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఖమ్మం నగరంలోని 36వ డివిజన్ రజక వీధిలో మెగా డైమండ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అమ్మవారి అలంకరణ, ప్రత్యేక పూజలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాలను కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహిస్తూ భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

**ముఖ్య అతిథులుగా ప్రముఖులు**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, చిరుమామిళ్ల రవికిరణ్, కొత్త వెంకటేశ్వరరావు, పసుమర్తి రామమోహనరావు, మాటేటి కిరణ్, పిల్లుట్ల కృష్ణ తదితరులు హాజరయ్యారు.

**పాల్గొన్న కమిటీ సభ్యులు**

ఈ కార్యక్రమంలో పిల్లుట్ల వెంకన్న, గూడెపు నాగరాజు, కన్నన్ శరవన్, బాతు రాజు, నవీన్ కుమార్, చల్లా రాకేష్, పిల్లుట్ల రామ్ చరణ్, సీతాలం సత్యసాయి, వెలిశాల వెంకటేష్, తాళ్లూరి కళ్యాణ్, గరిడేపల్లి రాజేష్, ఆళ్ల కిరీటి, బలరాం యాదవ్, పవన్ యాదవ్, గంధం సాయిరాం, చెల్లా మురళీకృష్ణ, కుమ్మరికుంట్ల వంశీ, తాళ్లూరు ఉపేందర్, నేరెళ్ల శివ, మారోజు సందీప్ తదితరులు పాల్గొన్నారు. భక్తి, సేవాభావంతో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు రజక వీధిలో ఆధ్యాత్మిక సందడిని నింపాయి.

# పాలకుల నిర్లక్ష్యంపై త్వరలో పాత్రికేయుల పోరుబాట

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో మాట తప్పిన పాలకుల వైఖరిపై త్వరలో రాష్ట్రవ్యాప్త కార్యాచరణ చేపడతామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టులు, టీజేయూ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఏటీ రాజారావు, కే. రాజశేఖర్ యాదవ్ లతో పాటు పలువురు స్థానిక జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సభ్యత్వం అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ముఖ్యమంత్రి మాట తప్పారని, అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, జర్నలిస్టుల ఆరోగ్య సమస్య, సామాజిక భద్రతలను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు.ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల జర్నలిస్టులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇంటి జాగాల కోసం ఎదురుచూసి ఎంతోమంది జర్నలిస్టులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేక అనేక చిన్న, మధ్యతరహా పత్రికలు, కేబుల్ ఛానళ్లు మూతపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై త్వరలో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త కార్యాచరణ ఉంటుందని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ కు జర్నలిస్టులంతా అండగా ఉండాలని, జిల్లాల్లో సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. సంగారెడ్డి జిల్లాలో త్వరలో నూతన నాయకత్వంలో మహాసభ జరుగుతుందని తెలిపారు.

# ప్రణాళిక ప్రకారం అన్ని పాఠశాలలను సందర్శించాలి

- విద్యార్థులకు తగిన జాగ్రత్తలు వివరించాలి
- వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధాకర్ లాల్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** మంగళవారం వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే.సుధాకర్ లాల్ జిల్లా సమీకృత కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు జిల్లా పరిధిలో రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం పనిచేస్తున్న 10 వైద్య బృందాల వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ప్రతి బృందము ప్రణాళిక ప్రకారం అన్ని పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకుంటూ, పోషకాహారం, పోషకాహార లోపం వల్ల కలిగే వివిధ ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యత తెలియజేయడమే గాక తరగతుల వారిగా ఉపాధ్యాయులు బాధ్యతలు తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థినిలలో పోషకాహార లోపం వలన రక్తహీనత, కంటి చూపు సమస్యలు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల వివరించాలని తెలిపారు. పాఠశాల విద్యార్థుల పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొనే వైద్య బృందాలు అన్ని ఒక సామాజిక బాధ్యతగా విధులు నిర్వహించాలని, భవిష్యత్ తరాల ఆరోగ్య పరిరక్షణ కోసం మన వంతు కృషి కచ్చితంగా చేయాలని సూచించారు. అనంతరం ఆర్ బి ఎస్ కే బృందాల వారిగా వారు ప్రతినెల సందర్శించాల్సిన పాఠశాలలు పాఠశాలల్లో తరచుగా విద్యార్థులకు వస్తున్న ఆరోగ్య సమస్యల గుర్తించి వాటి పరిష్కార మార్గాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి స్క్రీనింగ్ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించి అవసరం అయిన వారికి కళ్లద్దాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిని డాక్టర్ వరలక్ష్మి , డాక్టర్ విద్యా ప్రియ, డాక్టర్ నిఖిల్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిఎంహెచ్ ఓ డాక్టర్ కే సుధాకర్ లాల్ జీనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరిగిన మాతృ మరణం గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎం డి ఆర్ కమిటీ వైద్యులు డాక్టర్ అమృతలక్ష్మి మాతా శిశు సంరక్షణ అధికారిని, జిజిహెచ్ గైనకాలజిస్టులు డాక్టర్ భాను, డాక్టర్ నీరజ, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రషీద్, క్షేత్రస్థాయి సూపర్వైజర్ సిబ్బంది మహిళా ఆరోగ్య కార్యకర్త మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య సమీక్ష సమావేశం



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె. వెంకట్ అన్ని ఆరోగ్య కార్యక్రమాల అమలు, పురోగతి లక్ష్యాల సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి హెచ్ సి పరిధిలో అమలవుతున్న మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, అసంక్రమిత వ్యాధుల గుర్తింపు చికిత్స, క్షయ వ్యాధి నిర్మూలన తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని వైద్యాధికారులు సిబ్బందికి సూచించారు.గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్య సేవలుగర్భిణీ స్త్రీలందరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోఅందుబాటులో ఉన్న వైద్య సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇతర ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలనిసూచించారు. గర్భిణీలందరికీ ముందస్తు నమోదు జరిగేలా చూడాలి గర్భధారణ సమయంలో అవసరమైన అన్ని పరీక్షలు, క్రమంతప్పకుండాఏఎంసీచెకప్‌లు, రక్తహీనత పరీక్షలు మరియు ఇతర అవసరమైన వైద్య సేవలు అందించాలి– గర్భిణీలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి– హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య పర్యవేక్షణ అందించాలి ప్రతి గర్భిణీ ప్రభుత్వ వైద్య సేవలను పొందేలా ప్రత్యేక దృష్టి సారించాలి.

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల పెంపు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల శాతాన్ని గణనీయంగా పెంచాలని టీఎంహెచ్ వో ఆదేశించారు. మొత్తం ప్రసవాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాలు 80 శాతానికి మించి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.గర్భిణీలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలి. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు గర్భిణీలను నిరంతరం సంప్రదిస్తూ, ప్రసవ తేదీకి ముందుగానే ఆసుపత్రికి తీసుకువచ్చే విధంగా ప్రణాళిక రూపొందించాలి. తల్లి మరియు శిశువు ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

**అసంక్రమిత వ్యాధుల కార్యక్రమం**

రక్తపోట, మధుమేహం ఇతర అసంక్రమిత వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్, గుర్తింపు, నమోదు మరియు చికిత్స కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సూచించారు– అర్హులైన ప్రజలందరికీ ఎన్సిడి స్క్రీనింగ్ నిర్వహించాలి– రక్తపోటు, మధుమేహం బాధితులను గుర్తించి సంబంధిత పోర్టల్‌లో సరైన వివరాలతో నమోదు చేయాలి– ఆధార్ వివరాలు, వ్యాధి నిర్ధారణ వివరాలు మరియు చికిత్సకు సంబంధించిన సమాచారాన్ని సరిచూసుకోవాలి– ఇప్పటికే గుర్తించిన రోగులకు క్రమం తప్పకుండా మందులు, వైద్య సలహాలు ఫాలో–అప్ సేవలు అందించాలి– పెండింగ్‌లో ఉన్న డేటాను పరిశీలించి, పోర్టల్‌లో అవసరమైన సవరణలు పూర్తి చేయాలి. ఈ నెలాఖరులోగా ఎన్సీడీ కార్యక్రమంలో 100 శాతం లక్ష్య సాధనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్వో సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు– దీర్ఘకాలిక దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలి– అనుమానిత TB రోగుల నుంచి కఫ నమూనాలు సేకరించి పరీక్షలకు పంపాలి– నిర్ధారణ అయిన రోగులకు తగిన చికిత్స అందేలా చూడాలి–టీబి రోగుల కుటుంబ సభ్యులు సన్నిహితులకు అవసరమైన పరీక్షలు, కాంటాక్ట్ ట్రేసింగ్ నిర్వహించాలి.ప్రజారోగ్య పరిరక్షణ, సురక్షిత ప్రసవాలు, ఎన్ సి డి నియంత్రణ టిబి నిర్మూలనే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ పనిచేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎం లు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మారబోయిన రవి యాదవ్



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** తెలంగాణ శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారికి మారబోయిన రవి యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మధుసూదనాచారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రతి నీటి బొట్టు ను ఒడిసిపట్టాలి

- సాగునీరు పొదుపుగా వాడాలి
- జెడ్పి సీఈఓ చందర్ నాయక్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** చందర్ నాయక్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి జిల్లా ప్రజా పరిషత్ కామారెడ్డి రామారెడ్డి మండలంలోని రామారెడ్డి గ్రామపంచాయతీ పరిధిలో ఇస్సన్నపల్లి, గొల్లపల్లి, రాజమ్మ తండాలో విబిజి రాంజీలో చేపట్టిన పంట కుంట ను పరిశీలించడం జరిగింది . ఇట్టి పంట కుంటలో చేపల పెంపకం అజోల పశుగ్రాసం పంటగుంట గట్టుపైన పూలు పండ్లు కూరగాయల మొక్కలను పెంచాలని సూచించడం జరిగింది, ఎల్ నీ నో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు భూగర్భ జలాలు తగ్గుతున్నందున త్రాగు సాగునీరును పొదుపుగా వాడుకోవాలని ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ప్రతి రైతు పంట కుంటలు ప్రతి ఆవాస ప్రాంతానికి ఊట కుంటలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పడం జరిగింది, మురుగునీరు చెరువులు కుంటలు వ్యవసాయ పొలాలలో ప్రవాహాన్ని నివారించుటకు సోప్ పిట్ లు నిర్మించుకోవాలని చెప్పడం జరిగింది, పలు సూచనలు సలహాలు అధికారులకు చెప్పడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, ఏపీ ఓ ధర్మారెడ్డి, రామారెడ్డి సర్పంచ్ బండి ప్రవీణ్, గొల్లపల్లి సర్పంచ్ కిషన్ యాదవ్, ఇసన్నపల్లి సర్పంచ్ డోకి లచ్చయ్య, పంచాయతీ సెక్రెటరీ లు రాజు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు రజిత, తదితరులు పాల్గొన్నారు.

## కాలభైరవ స్వామిని దర్శించుకున్న సొసైటీ చైర్మన్

**బొంబోతుల లింగా గౌడ్**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఇసనపల్లిలో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామిని మంగళవారం రోజున వడ్లూర్ఎల్లారెడ్డి పిఎసిఎస్ సొసైటీ చైర్మన్ బొంబోతుల లింగా గౌడ్, డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, కామారెడ్డి రవి గౌడ్, ఇతర డైరెక్టర్లు కాలభైరవ స్వామిని దర్శించుకున్నారు, పంతులు శ్రీనివాస్ శర్మ స్వామి వారి హారతి సమర్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు, అనంతరం ఆలయ సిబ్బంది, శాలువాతో సత్కరించి, కాలభైరవ స్వామి జ్ఞాపకం ను అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, అసిస్టెంట్ ఈవో లక్ష్మణ్, ,రామారెడ్డి సర్పంచ్ బండి ప్రవీణ్, యూత్ ప్రెసిడెంట్ రంజిత్, ఆలయ సిబ్బంది, పంతులు శ్రీనివాస్ శర్మ, మణిశర్మ, నాగరాజు, డైరెక్టర్ గంగ రాజ గౌడ్, బైరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలోకి 30 కుటుంబాలు చేరిక



**అనంతపురం అక్టోబర్ 13. రాజముద్ర న్యూస్:**

ఉరవకొండ నియోజకవర్గం లోనివిడపనకల్ మండలం కడదరబెంచి గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుడు పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలోచేరిన వారికి ఆయన పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఉరవకొండ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, నియోజకవర్గ ప్రగతికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి మద్దతుగా నిలుస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రతాప్ నాయుడు, గడేకల్ భీమలింగ, గడేకల్ శీనా, సర్పంచ్ దేవరాజ్, కడదరబెంచి భీమలింగ, చిన్నారెడ్డి, యోగానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం ప్యాకేజీ అక్రమాలపై చర్యలేవీ?..

**బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలి..**

**దేవీపట్నం (ఇందుకూరుపేట), అక్టోబరు 13 రాజముద్ర న్యూస్:**



పోలవరం ప్రాజెక్టు భూసేకరణ, పునరావాస ప్యాకేజీ నిధుల పంపిణీలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసినట్లు తేలిన వ్యక్తుల నుంచి నిధులను రికవరీ చేసి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో మంగళవారం నిర్వహించిన పరిషత్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు పరిహారం పంపిణీలో వాస్తవ భూయజమానులైన ఆదివాసీలకు అన్యాయం జరిగిందని, గిరిజనేతరులకు అక్రమంగా పరిహారం చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయని కుంజా శ్రీను పేర్కొన్నారు. మార్కెట్ విలువలకు మించి భూముల ధరలు నిర్ణయించి, అక్రమంగా పరిహారం మంజూరు చేసినట్లు విమర్శించారు. బాధితుల ఫిర్యాదులపై ఉన్నతాధికారులు, విజిలెన్స్ శాఖ నివేదికలు ఇచ్చినప్పటికీ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. అక్రమంగా పొందిన పరిహారాన్ని రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేసి, అసలైన హక్కుదారులకు అందించాలని కోరారు. ఈ సమావేశంలో బల్లెం గంగాభవాని, యాలగడ్డ నాగేశ్వరరావు, నరసయ్యమ్మ, నాగేశ్వరరావు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లతో క్లీనింగ్ పనులు చేయిస్తే సహించేది లేదు!

**చర్యలు తీసుకోకుంటే జిల్లా వ్యాప్త ఆందోళన**

**రంపచోడవరం, అక్టోబర్ 13 రాజముద్ర న్యూస్:**



గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లతో ఆసుపత్రుల శుభ్రత పనులు చేయించడం, దీనిని ప్రశ్నించిన యూనియన్ నాయకులను బెదిరించడం ఏమాత్రం సమంజసం కాదని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పోలవరం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. పెదగెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో మారేడుమిల్లి పీహెచ్‌సీలో ఆశా వర్కర్లతో క్లీనింగ్ పనులు చేయించిన ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ స్పందించి, ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా ఆశా వర్కర్లతో క్లీనింగ్ పనులు చేయించరాదని సర్క్యులర్ జారీ చేసినట్లు గుర్తుచేశారు. అయినప్పటికీ జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత నెల 29వ తేదీన పోలవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేసి, ఆశా వర్కర్లను ఆసుపత్రుల క్లీనింగ్ పనుల నుంచి పూర్తిగా మినహాయించాలని కోరినట్లు తెలిపారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడం విచారకరమన్నారు.

## ఎస్ ఎస్ సి టాపర్‌కు ఘన సన్మానం

**కదిరి అక్టోబర్ 13 రాజముద్ర న్యూస్:**



దుశ్శలువాతో సత్కరిస్తున్న మదరసా సభ్యులు

కదిరి పట్టణంలోని స్థానిక కాలేజీ రోడ్డులో మదరసా రబ్బానీయా నందు గతేడాది విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి అనంతపురం మరియు శ్రీ సత్యసాయి జిల్లాల టాపర్‌గా నిలిచిన కుమారి మొఘల్ ఆఫీఫా ఫాతిమాను యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమానికి హజ్రత్ మౌలానా ఇస్మాయిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టాపర్ ఆఫీఫా ఫాతిమాను మదరసా ప్రతినిధులు దుశ్శాలువాతో కప్పి, మెమెంటోతో పాటు పవిత్ర గ్రంథం ఖురాన్‌ను బహూకరించి అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఆకాంక్షించారు.

**నాలుగు సంవత్సరాల సేవలకు గుర్తింపు**

అలాగే, గత నాలుగు సంవత్సరాలుగా మదరసాలో విశేష సేవలందిస్తున్న మౌలిమ షాఫియా కౌసర్ సేవలను యాజమాన్యం కొనియాడింది. ఆమెను కూడా దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి, తగిన పారితోషికాన్ని అందజేసి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో మదరసా కార్యదర్శి హాజీ అత్తార్ మహబూబ్ భాష, అధ్యక్షుడు హాజీ జాఫర్ సాదిక్, కోశాధికారి అజీమ్ ఖాన్, ఉప కార్యదర్శి అన్వర్ భాషా, హాఫీజ్ అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు

- **రెండు తెలుగు రాష్ట్రాలకు శ్రీశైలం ప్రాజెక్టు గర్వకారణం**
- **ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**అమరావతి, అక్టోబర్ 13 రాజముద్ర న్యూస్:** శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం తెలుగు రాష్ట్రాల ప్రజలకు గర్వకారణమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. డ్యామ్ నిర్మాణ పటిష్ఠత, జలవిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, సాగు, తాగు నీటి అవసరాలకు అందిస్తున్న సేవలకు అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. శ్రీశైలం జలాశయం దశాబ్దాలుగా భారీ వరదలను తట్టుకుంటూ ప్రజలకు సేవలందిస్తోందని మంత్రి తెలిపారు. ఇది కేవలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాత్రమే కాదని, లక్షలాది మంది తాగునీటి అవసరాలతో పాటు లక్షల ఎకరాల సాగునీటి అవసరాలను తీరుస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు అని వివరించారు. కృష్ణా జలాల వినియోగంలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో విశేషమైన ప్రాధాన్యం కలిగి ఉందన్నారు.

## ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ గేమింగ్ పెట్టుబడుల పేరుతో మోసం

- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
- **కళ్యాణ్ మార్నింగ్ మిలన్ మార్నింగ్ శ్రీదేవి పేర్లతో నకిలీ విజేతల వీడియోలు,**
- **మనీ వోచర్ల ద్వారా సైబర్ మోసం**
- **వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాను ఉపయోగించుకొని ప్రజలకు అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపిస్తూ, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, పెట్టుబడుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇలాంటి ప్రకటనలను నమ్మి డబ్బులు పంపవద్దని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రజలకు సూచించారు. ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతులను అనుసరిస్తున్న నేపథ్యంలో అపరిచిత వ్యక్తులు సోషల్ మీడియాలో పెట్టే పెట్టుబడి ప్రకటనలు, నకిలీ విజేతల వీడియోలు, డబ్బులు గెలుచుకున్నట్లు చూపించే వోచర్లు, బహుమతులు పొందేందుకు ముందుగా రుసుములు చెల్లించాలనే సందేశాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హెచ్చరించారు. కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గట్టనపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ గేమింగ్, పెట్టుబడుల ప్రకటనను చూసి సైబర్ మోసానికి గురైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 35/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.బాధితుడు ఫేస్‌బుక్‌లో కళ్యాణ్ మార్నింగ్ పేరుతో ఉన్న ఆన్‌లైన్ గేమింగ్ ప్రకటనను చూసి, అందులో ఇచ్చిన మొబైల్ నంబర్ ద్వారా సంబంధిత వ్యక్తులను సంప్రదించాడు. మొదట కొంత మొత్తాన్ని పంపితే పెట్టుబడి ద్వారా ఆదాయం పొందవచ్చని నమ్మించారు. అనంతరం ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని కోరడంతో బాధితుడు డబ్బులు బదిలీ చేశాడు. ఆ తర్వాత బాధితుడికి కళ్యాణ్ మార్నింగ్ మిలన్ మార్నింగ్ శ్రీదేవి పేర్లతో గెలుపొందినట్లు చూపించే నకిలీ మనీ వోచర్లు పంపించి, సుమారు రూ.2,65,000 గెలుచుకున్నట్లు నమ్మించారు. అయితే ఆ మొత్తాన్ని విడుదల చేయాలంటే సర్వీస్ ఛార్జీలు, జీఎస్టీ, ఇతర పన్నులు చెల్లించాలని చెప్పి విడతలవారీగా డబ్బులు వసూలు చేశారు. ఈ విధంగా బాధితుడి నుంచి పలు ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా మొత్తం సుమారు రూ.1,58,300 బదిలీ చేయించుకున్నట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930ను సంప్రదించి, అనంతరం కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 03-03-2026న ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారు. పథకం ప్రకారం సోషల్ మీడియా ద్వారా మోసం దర్యాప్తులో లభించిన సమాచారం ప్రకారం, నిందితులు ఆన్‌లైన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, గేమింగ్ అప్లికేషన్లను ఉపయోగించి ప్రజలను ఆకర్షించే ప్రకటనలు, నకిలీ విజేతల వీడియోలు, డబ్బులు గెలుచుకున్నట్లు చూపించే వోచర్లు తయారుచేసి ప్రచారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. వీటిని చూసిన అమాయక ప్రజలు నిజంగానే డబ్బులు గెలుచుకున్నారని నమ్మి సంప్రదించేలా చేసి, గెలుపొందిన మొత్తాన్ని పొందాలంటే ముందుగా ప్రాసెసింగ్ ఫీజు, సర్వీస్ ఛార్జీలు, జీఎస్టీ తదితర పేర్లతో డబ్బులు చెల్లించాలని కోరినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితులు పంపిన డబ్బులను వివిధ బ్యాంకు ఖాతాలు, ఆన్‌లైన్ పేమెంట్ స్కానర్ల ద్వారా బదిలీ చేసినట్లు కేసు దర్యాప్తులో గుర్తించారు. మరో ముగ్గురు నిందితుల అరెస్ట్ఈ కేసులో కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ తమ సిబ్బందితో కలిసి తెలంగాణలోని కామారెడ్డి పట్టణ బస్‌స్టాండ్ ప్రాంతంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక తెల్లరంగు మారుతి సుజుకి స్విఫ్ట్ డిజైర్ కారు, పలు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కేసులో గతంలోనూ కొందరు నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది. మిగిలిన నిందితుల కోసం దర్యాప్తు కొనసాగుతోంది.ఈ కేసులో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, ఆయన బృందం సాంకేతిక ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ ఆధారాల పరిశీలనతో దర్యాప్తు చేపట్టారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, నిందితుల పాత్రను గుర్తించేందుకు పోలీసులు చర్యలు కొనసాగిస్తున్నారు.సైబర్ నేరగాళ్లు ప్రజల ఆశలు, అత్యవసర అవసరాలు, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆకాంక్షలను ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. అపరిచిత వ్యక్తులు చెప్పే మాటలను గుడ్డిగా నమ్మి కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోవద్దు. ఏదైనా ఆన్‌లైన్ పెట్టుబడి లేదా గేమింగ్ ప్రకటన కనిపించినప్పుడు ముందుగా దాని నిజానిజాలను పరిశీలించాలి. అనుమానాస్పద లావాదేవీలకు దూరంగా ఉండాలి.సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు, ఇలాంటి మోసాల గురించి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, పరిచయస్తులకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు.

## నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి




- **జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**
- **పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి, పురావస్తు కట్టడాల పరిరక్షణకు రూ.4.26 కోట్లు మంజూరు**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** జిల్లాలోని నేలకొండపల్లిలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాచీన బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో అంశంపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో బౌద్ధ భిక్షువుల సలహాలు, సూచనలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేలకొండపల్లి తెలంగాణలోని అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన బౌద్ధ పురావస్తు క్షేత్రాలలో ఒకటని, గతంలో నిర్వహించిన పురావస్తు తవ్వకాల ద్వారా మహాస్తూపం, బౌద్ధ విహారాలు, సమావేశ మందిరాల అవశేషాలు వెలుగులోకి వచ్చాయన్నారు.ఈ చారిత్రక సంపదను శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షిస్తూ భావితరాలకు అందించడంతో పాటు, దేశవిదేశాల బౌద్ధ యాత్రికులను ఆకర్షించేలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని అన్నారు. కేవలం భవన నిర్మాణంలా కాకుండా, బౌద్ధ ధర్మానికి గౌరవ సూచకంగా ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు తెలిపారు. వచ్చే 18 నెలల్లో నేలకొండపల్లిని భారతదేశంలోని టాప్-3 బౌద్ధ క్షేత్రాలలో నిలపడమే లక్ష్యమని, ఇందుకోసం పురావస్తు శాఖ, బౌద్ధ ధర్మ నిపుణులు శివనాగిరెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ ఉపేంద్ర రెడ్డి, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ లక్ష్మయ్య తదితరులతో కోర్ టీమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి మాట్లాడుతూ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.2.50 కోట్లతో పర్యాటక మౌలిక సదుపాయాలు, రూ.1.76 కోట్లతో పురావస్తు కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నిధులను వైటీపీఎస్, తెలంగాణ జెన్ కో ద్వారా సమకూర్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కంబోడియా, థాయిలాండ్, భారత్ దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులతో మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమీషనర్ పి.వి. శ్రీనివాసరావు, హెరిటేజ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్లు డా.పి.నాగరాజు, ఎన్.నరసింగ్, జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, తహసీల్దార్ రాంప్రసాద్, సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి , ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా.ఇ.శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మీలో ఒకడిగా ఉండి, మీకు అండగా సేవ చేసే భాగ్యం నాకు కలిగింది..ఎమ్మెల్యే అమిలినేని

**అనంతపురం అక్టోబర్ 13.రాజముద్ర న్యూస్:**




మీలో ఒకడిగా ఉంటూ మీకు తోడుగా, అండగా ఉండి, మీకు సేవ చేసే భాగ్యం కలిగినందుకు చాలా సంతోషిస్తున్నానని, మన నియోజకవర్గంలో రెండవ అత్యధిక జనాబా కలిగిన దళిత, గిరిజన సోదరుల కోసం అద్భుతమైన, అందమైన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబెడ్కర్ గారి భవనం నిర్మించేందుకు ఏప్రిల్ 14న భూమిపూజ చేయడం జరిగిందని, కేవలం ఇక భవనం నిర్మిస్తే సరిపోదు వారికి చిరస్తాయిగా నిలిచేలా యువతకు కూడా ఉపయోగపడేలా ఉండాలని ప్రభుత్వం వారు ఇచ్చిన స్కెచ్ కాదని స్వంతంగా 4వ డైమెన్షన్ బాంబె ఆర్కిటెక్చర్ వారితో నమూనాలు తయారు చేయించామని అందులో గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం ఫంక్షన్ హాల్ గాను, అందులో రెండు రూములు, మొదటి ఫ్లోర్ లో డైనింగ్ హాల్ తో పాటు గెస్ట్ రూములు, రెండవ ఫ్లోర్ మొత్తం డిజిటల్ లైబ్రరీ ఉండేలా నిర్మించేందుకు సుమారుగా 5.50 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని అందులో జిల్లా కలెక్టర్ గారి నుంచి దాదాపు 3 కోట్ల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారని, మిగిలినది ఎవరినైన దాత సహకారంతో పూర్తి చేసేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు ప్రజావేదికలో 4వ డైమెన్షన్ బాంబె ఆర్కిటెక్చర్ వారి ద్వారా తయారు చేయించిన అంబెడ్కర్ భవన నమూనాను నేడు వర్చువల్ విధానంలో పెద్ద ఎత్తున తరలివచ్చిన దళిత, గిరిజన సోదర, సోదరీమణులు, టీడీపీ నాయకులు సమక్షంలో లాంచనంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అందరికి ప్రదర్శించడం జరిగింది..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు మాట్లాడుతూ మిగిలిన రాష్ట్రాల్లో దళితులు అనే మాట విన్పించడం తగ్గిపోయిందని దానికి కారణం ఆయా రాష్ట్రాల్లో దళితులు ఉన్నత చదువులు చదివి ఐఏఎస్, ఐపీఎస్ తో పాటు రాజకీయంగా కూడా మంచి స్థితిలో ఉండటమే అన్నారు..

## జిల్లెలగూడ సాయినగర్ లో ఇందిరమ్మ చీరల పంపిణీ

**మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత**
**– మాజీ కార్పొరేటర్ గజ్జల రామచందర్**

**మీర్ పేట్, అక్టోబర్ 13, రాజముద్ర న్యూస్:**



జిల్లెలగూడ 60వ డివిజన్ పరిధిలోని సాయినగర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సూచనలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గజ్జల రామచందర్ మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గజ్జల రామచందర్ మాట్లాడుతూ, మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, సాధికారతకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళల గౌరవాన్ని పెంపొందించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు జి. కవిత, ఎస్. హైమావతి, కె. పద్మ, డ్వాక్రా సంఘం అధ్యక్షురాళ్లు ఎస్. గంగమ్మ, ఎస్. శోభారాణి, సంఘ సభ్యులు ఎస్. పుష్పమ్మ, కె. లావణ్యతో పాటు డ్వాక్రా సంఘాల సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.




# ఐసీసీ అవార్డుల్లో గిల్, షఫాలీ వర్మకు గుర్తింపు

**దుబాయ్, అక్టోబరు 13 :** భారత క్రికెటర్లు శుభ్‌మన్ గిల్, షఫాలీ వర్మ తమ అద్భుత ప్రదర్శనలతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఐసీసీ నెలవారీ ఉత్తమ ఆటగాళ్ల పురస్కారాలను వీరిద్దరూ అందుకున్నారు. పురుషుల విభాగంలో గిల్ ఈ పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకోగా, మహిళల విభాగంలో షఫాలీ వర్మ తన ఆటతీరుతో మరోసారి అవార్డును దక్కించుకున్నారు. భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ నెలవారీ ఉత్తమ పురుష ఆటగాడి పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకున్నాడు. గతంలో 2023 జనవరి, సెప్టెంబరు నెలల్లో, 2025 ఫిబ్రవరి, జూలై నెలల్లో ఈ అవార్డును అందుకున్నాడు. తాజాగా మరోసారి పురస్కారం దక్కించుకోవడంతో ఈ ఘనత సాధించిన ఆటగాళ్లలో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గిల్ బ్యాట్‌తో మెరిశాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులు సాధించగా, రెండో వన్డేలో 223 పరుగులతో సత్తా చాటినట్లు సమాచారం. తన అభిమానుల ముందు పరుగులు సాధించడం ప్రత్యేక ఆనందాన్ని ఇచ్చిందని గిల్ పేర్కొన్నాడు. ఐదోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని, తనను ఎంపిక చేసిన ఐసీసీ ప్యానెల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు. భారత మహిళా క్రికెటర్ షఫాలీ వర్మ కూడా ఐసీసీ నెలవారీ ఉత్తమ మహిళా ఆటగాడి అవార్డును గెలుచుకుంది. గత ఏడాది నవంబరులోనూ ఆమె ఈ పురస్కారాన్ని అందుకుంది. ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై కీలక ఇన్నింగ్స్ ఆడి భారత జట్టు విజయానికి తోడ్పడిన షఫాలీ, ఇటీవల జరిగిన పోటీల్లోనూ తన దూకుడైన ఆటను కొనసాగించింది. ఆసియా కప్‌లో షఫాలీ వర్మ 360 పరుగులు సాధించడంతో పాటు ఆరు వికెట్లు పడగొట్టింది. ఆసియా క్రీడల్లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శతకం సాధించగా, శ్రీలంకతో జరిగిన ఫైనల్లో 48 పరుగులు చేసింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. మరోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని షఫాలీ పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ గుర్తింపు పొందడం తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని తెలిపింది. గిల్, షఫాలీకి అవార్డులు దక్కడంతో భారత క్రికెట్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# రంజీ ట్రోఫీలో అభిషేక్ పోరెల్ శతకం



**కల్యాణి, అక్టోబరు 13 :** బెంగాల్ వికెట్‌కీపర్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ రంజీ ట్రోఫీలో అద్భుత ప్రదర్శన చేశాడు. ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో శతకంతో మెరిసిన అతడు.. సెంచరీ పూర్తి చేసిన వెంటనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఇటీవల వ్యక్తిగత, న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొన్న అనంతరం మైదానంలోకి తిరిగి వచ్చిన పోరెల్ తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతడి భావోద్వేగ క్షణాలు మైదానంలో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ సీజన్‌లో బెంగాల్ తరఫున తొలి మ్యాచ్ ఆడుతున్న 23 ఏళ్ల పోరెల్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 137 బంతుల్లో 114 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో బ్యాటర్ సుదీప్ ఘరామి సైతం 122 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. వీరిద్దరూ శతకాలతో రాణించడంతో బెంగాల్ జట్టు భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ జట్టు 240 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. దీంతో ప్రత్యర్థిపై 64 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. కీలక సమయంలో పోరెల్, ఘరామి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తన రెండో శతకాన్ని పూర్తి చేసిన వెంటనే పోరెల్ మోకాళ్లపై కూర్చొని కన్నీళ్లు పెట్టుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తేరుకుని బ్యాట్‌ను పైకెత్తి అభివాదం చేశాడు. ఈ దృశ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మ్యాచ్ అనంతరం పోరెల్ మాట్లాడుతూ.. తాను తెలియకుండానే భావోద్వేగానికి గురయ్యానని తెలిపినట్లు కథనాలు పేర్కొన్నాయి. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలనుకుంటున్నట్లు వెల్లడించాడు. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన కోచ్ లక్ష్మీ రతన్ శుక్లా, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపాడు. కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని పెళ్లి పేరుతో మోసం చేశాడని, అత్యాచారం, బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ పోరెల్‌పై ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఫిర్యాదు నేపథ్యంలో ఆగస్టు 11న పోలీసులు అతడిని అరెస్టు చేసినట్లు కథనాలు వెల్లడించాయి. నెల రోజులకు పైగా జైలులో ఉన్న అనంతరం సెప్టెంబరులో చిన్సురా కోర్టు నుంచి బెయిల్ పొందినట్లు సమాచారం. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను పోరెల్ ఖండించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలు న్యాయపరమైన విచారణకు సంబంధించినవి కావడంతో, వాటిని నిర్ధారిత నేరాలుగా పరిగణించరాదు. బెయిల్‌పై విడుదలైన తర్వాత పోరెల్‌కు బెంగాల్ రంజీ జట్టులో చోటు దక్కింది. అతడి వ్యక్తిగత, న్యాయపరమైన వ్యవహారాలు తమ పరిధిలోకి రావని, జట్టు ఎంపికలో అతడిని పరిగణనలోకి తీసుకున్నామని బెంగాల్ క్రికెట్ సంఘం తెలిపినట్లు సమాచారం. ఢిల్లీతో మ్యాచ్‌లో శతకం సాధించడం ద్వారా పోరెల్ తన క్రికెట్‌పై దృష్టి సారించాడు. అతడి ప్రదర్శన బెంగాల్ జట్టుకు కీలకంగా మారింది.

# ప్రపంచకప్ జట్టులో కోహ్లీ, రోహిత్‌కు చోటు దక్కేనా?




**న్యూఢిల్లీ, అక్టోబరు 13 :** 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తుపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు మిథున్ మన్హాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. జట్టు ఎంపికలో వయసు కంటే ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రదర్శనకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అయితే, తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని పేర్కొన్నారు. 2027 వన్డే ప్రపంచకప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనుంది. ఈ మెగా టోర్నీలో భారత్ తరఫున ఎవరు బరిలోకి దిగుతారన్న అంశంపై ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా వయసు పెరుగుతున్న కోహ్లీ, రోహిత్ జట్టులో కొనసాగుతారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై స్పందించిన మిథున్ మన్హాస్.. ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా నిర్ణయం తీసుకోదని, సెలెక్టర్లు, కోచ్‌లు ఆటగాళ్ల ప్రదర్శనను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారని వివరించినట్లు సమాచారం. ఆటగాడి వయసును మాత్రమే ప్రమాణంగా తీసుకోకుండా, అతడి ఫిట్‌నెస్, ఆటతీరు, జట్టుకు అందించే సహకారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించే సామర్థ్యం ఉన్నవారికి వయసు అడ్డంకి కాకూడదన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడిని ఎదుర్కొన్న సీనియర్ ఆటగాళ్ల అనుభవం జట్టుకు బలాన్నిస్తుందని భావిస్తున్నారు. అదే సమయంలో జస్‌ప్రీత్ బుమ్రా వంటి బౌలర్లు బౌలింగ్ విభాగంలో కీలక బాధ్యతలు చేపట్టగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఆటగాళ్లు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తే ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీల్లో విజయావకాశాలు మెరుగుపడతాయని విశ్లేషించారు. మాజీ భారత క్రికెటర్ మహమ్మద్ కైఫ్ కూడా 2027 ప్రపంచకప్ సన్నద్ధతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికా పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పరిస్థితుల్లో బౌలర్ల నాణ్యత కీలకంగా మారుతుందని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంతో పాటు కీలక సమయాల్లో వికెట్లు తీయగల బౌలింగ్ విభాగం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్‌ను గెలవాలంటే భారత్ బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని కైఫ్ సూచించారు. పరుగులను అడ్డుకోవడం, కీలక క్యాచ్‌లను అందుకోవడం, ఒత్తిడిలో తప్పిదాలను తగ్గించుకోవడం విజయానికి దోహదపడతాయని పేర్కొన్నారు. మొత్తంగా 2027 ప్రపంచకప్‌లో కోహ్లీ, రోహిత్ ఆడే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. వారి ప్రస్తుత ఫిట్‌నెస్, ప్రదర్శన, జట్టు అవసరాలను బట్టి ఎంపికపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తుది జట్టు కూర్పుపై అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ అంశంపై ఉత్కంఠ కొనసాగనుంది.



# వెస్టిండీస్ ఆటగాళ్లకు ఐసీసీ మందలింపు

**దుబాయ్, అక్టోబరు 13 :** భారత్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు విజయం సాధించినప్పటికీ, ఆ జట్టు ఆటగాళ్లు రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్‌లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి మందలింపు ఎదురైంది. మైదానంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఇద్దరికీ ఒక్కొక్క డీమెరిట్ పాయింట్ విధించినట్లు సమాచారం. అక్టోబరు 9న రాంచీలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ సందర్భంగా వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ బ్యాట్‌తో బంతిని బాదిన ఘటనను ఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే బ్యాటర్ షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేసిన వ్యవహారంపైనా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి పావెల్, రూథర్‌ఫర్డ్‌లను ఐసీసీ మందలించడంతో పాటు ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ కేటాయించినట్లు వార్తలు వెల్లడించాయి. అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆటగాళ్లు ఐసీసీ ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. మైదానంలో అనుచిత ప్రవర్తన, అంపైర్ల నిర్ణయాలపై అసహనం వ్యక్తం చేయడం వంటి ఘటనలపై నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. భారత్‌పై రెండో టీ20లో విజయం సాధించిన వెస్టిండీస్‌కు ఈ పరిణామం ఎదురైంది. అయితే ఈ చర్యలపై పూర్తి వివరాలు, అధికారిక ప్రకటనకు సంబంధించిన సమాచారం స్పష్టంగా అందుబాటులోకి రావాల్సి ఉంది.

# టీమిండియాలోకి ఔకిబ్ నబీ.. కారు కొనుగోలుపై చర్చ!

**గువాహటి, అక్టోబరు 13 :** జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ క్రికెటర్ ఔకిబ్ నబీ భారత జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో భాగంగా గువాహటిలోని బర్సాపరా క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో టీమిండియా తరఫున తొలి మ్యాచ్ ఆడాడు. భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చేతుల మీదుగా జాతీయ జట్టు టోపీని అందుకున్నాడు. దీంతో జమ్మూకశ్మీర్ నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మూడో క్రికెటర్‌గా నిలిచాడు. గతంలో పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ ఈ ఘనత సాధించారు.

### షోరూమ్‌లో కారు.. సామాజిక మాధ్యమాల్లో చర్చ

అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఔకిబ్ నబీకి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియోలో అతడు ఓ కార్ల ప్రదర్శనశాలలో హ్యుందాయ్ కారులో కూర్చొని కనిపించాడు. దీంతో నబీ కొత్త కారు కొనుగోలు చేశాడంటూ పలువురు అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు. అయితే, అతడు నిజంగానే కారును కొనుగోలు చేశాడా? అనే విషయంపై స్పష్టమైన సమాచారం లేదు.

### అరంగేట్ర మ్యాచ్‌లో నిరాశాజనక ప్రదర్శన

భారత జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ, తొలి వన్డేలో నబీకి కఠిన పరీక్ష ఎదురైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై బౌలింగ్ చేసిన అతడు 8.4 ఓవర్లలో 84 పరుగులు సమర్పించుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ కావడంతో అతడిపై అంచనాలు నెలకొన్నప్పటికీ, బౌలింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. భారత వన్డే జట్టుకు ఎంపిక కావడంతో నబీ ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌కు జమ్మూకశ్మీర్ తరఫున అందుబాటులో లేకపోయాడు. ఆ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ జట్టు రెస్ట్ ఆఫ్ ఇండియా చేతిలో 167 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

### రంజీ ట్రోఫీలో 60 వికెట్లు

2025-26 రంజీ ట్రోఫీ సీజన్‌లో ఔకిబ్ నబీ అద్భుతంగా రాణించాడు. ఏకంగా 60 వికెట్లు పడగొట్టి జమ్మూకశ్మీర్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో అతడికి భారత టెస్టు జట్టులోనూ అవకాశం దక్కవచ్చనే అంచనాలు ఏర్పడ్డాయి. ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులోనూ నబీకి చోటు లభించింది. భారత్ ఆ సిరీస్‌ను 1-0తో గెలుచుకున్నప్పటికీ, తుది జట్టులో ఆడే అవకాశం అతడికి రాలేదు. అనంతరం ఇంగ్లాండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సర్రే జట్టు తరఫున ఆడాడు.

### సెలెక్టర్ల దృష్టిలో నబీ ప్రదర్శన

అంతర్జాతీయ స్థాయిలో తొలి మ్యాచ్ ఆడిన నబీ, రాబోయే పోటీల్లో తన బౌలింగ్‌తో ఆకట్టుకోవాల్సి ఉంది. అతడి ప్రదర్శనను భారత సెలెక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది. భారత్-ఎ జట్టు న్యూజిలాండ్ పర్యటనతో పాటు రానున్న టెస్టు సిరీస్‌ల కోసం జట్ల ఎంపిక నేపథ్యంలో దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి ప్రదర్శన కీలకం కానుంది. రంజీ ట్రోఫీలో వికెట్ల వేటతో గుర్తింపు పొందిన నబీ, భారత జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంటాడా అనేది ఆసక్తికరంగా మారింది.









# అందంతో కట్టిపడేస్తున్న టాలీవుడ్ బుట్టబొమ్మ..

## పూజా హెగ్డే బర్త్‌డే స్పెషల్!

**హైదరాబాద్, అక్టోబర్ 13 :** టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే తన పుట్టినరోజును ఎంతో వేడుకగా జరుపుకుంటున్నారు. టాలీవుడ్ నుంచి కోలీవుడ్, బాలీవుడ్ వరకు తన అందం, అద్భుతమైన నటనతో మిలియన్ల మంది అభిమానుల మనసులను గెలుచుకున్న ఈ భామకు సోషల్ మీడియా వేదికగా సినీ ప్రముఖులు, అభిమానులు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆమె షేర్ చేసిన గ్లామరస్ ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో బ్లూ అండ్ వైట్ డ్రెస్, బేబీ పింక్ గౌనులో రాయల్ లుక్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇక పూజా నటించిన 'బుట్టబొమ్మ', 'అరబిక్ కుతు', 'జిగేల్ రాణి' వంటి సాంగ్స్ ఇప్పటికీ సోషల్ మీడియా రీల్స్‌లో ట్రెండ్ అవుతూనే ఉన్నాయి. గ్లామర్‌తో పాటు అద్భుతమైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆమె ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. సినిమాల విషయానికి వస్తే, దుల్కర్ సల్మాన్‌తో కలిసి రవి నీలకూడితి దర్శకత్వంలో వస్తున్న 'శ్రీ శ్రీ' చిత్రంతో ఆమె టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారు. అలాగే లారెన్స్ హర్రర్ ఫ్రాంచైజీ 'కాంచన 4' వంటి భారీ చిత్రాల్లోనూ నటిస్తూ బాక్సాఫీస్ వద్ద విజయం సాధించేందుకు సిద్ధమవుతున్నారు.

# టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు..

## మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో ఊగిసలాట!

**హైదరాబాద్, అక్టోబర్ 13 :** టాలీవుడ్‌లో 'సీతారామం', 'హాయ్ నాన్న' వంటి బ్లాక్‌బస్టర్ విజయాలతో నటిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో ప్రస్తుతం మిశ్రమ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ చిత్రాల తర్వాత ఆమె దూసుకెళ్తుందని అంతా భావించినప్పటికీ, 'ఫ్యామిలీ స్టార్' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడం ఊహించని పరిణామమైంది. ఇక 'కల్కి 2898 ఏడి' చిత్రంలో ఆమె చేసిన మొక్కుబడి పాత్ర పెద్దగా వర్కౌట్ కాలేదు. ఈ ఏడాది వచ్చిన 'డెకాయిట్' చిత్రం డీసెంట్ హిట్‌గా నిలిచినప్పటికీ, ఆ పాత్రలోని విభిన్నమైన ట్విస్ట్ అభిమానులకు పూర్తిగా కనెక్ట్ కాలేదనే చెప్పాలి. ప్రస్తుతం సౌత్ ఆఫర్ల విషయంలో మృణాల్ కొంత ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అల్లు అర్జున్ రాకా చిత్రంలో ఆమె నటిస్తున్నారంటూ గత కొంతకాలంగా జోరుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, మీడియా ప్రశ్నించినా ఆమె ఈ విషయాన్ని నేరుగా ధృవీకరించడం లేదు. చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించే వరకు ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడకూడదన్న నిబంధన కారణంగానే ఆమె స్పందించడం లేదని సమాచారం. మరోవైపు బాలీవుడ్‌లో 2026 ఆమెకు అంతగా కలిసి రాలేదనే చెప్పాలి. 'దో దివానే షెహర్ మే', 'హే జవానీతో ఇష్క్ హోనా హై' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా కొట్టాయి. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 'పూజా మేరీ జాన్' చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలైనప్పటికీ సోషల్ మీడియాలో పెద్దగా సౌండ్ చేయలేదు. మొత్తంగా ఉన్నంతలో 'డెకాయిట్' ఒక్కటే ఆమెకు కొంత ఊరటనిచ్చింది. ఇక కథ ప్రకారం 'కల్కి 2'లోనూ ఆమె పాత్ర ఉండాల్సి ఉండగా, దర్శకుడు నాగ్ అశ్విన్ ఏలాంటి మార్పులు చేస్తారనే దానిపై త్వరలోనే స్పష్టత రానుంది.



# దర్శకుడి అసభ్య ప్రతిపాదన..

## నటి నీతి టేలర్ సంచలన వ్యాఖ్యలు!

**హైదరాబాద్, అక్టోబరు 13 :** సినీ పరిశ్రమలో అవకాశాల పేరుతో కొత్తగా వచ్చే నటీనటులకు ఎదురవుతున్న అనుచిత ప్రతిపాదనలపై బుల్లితెర నటి నీతి టేలర్ సంచలన విషయాలను బయటపెట్టారు. తన సినీ ప్రయాణం ప్రారంభంలో ఎదురైన ఓ చేదు సంఘటనను గుర్తుచేసుకుంటూ.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో రెండో సినిమా అవకాశం కోసం ఓ దర్శకుడు తనకు అసభ్యకరమైన షరతు విధించాడని ఆవేదన వ్యక్తం చేశారు. టెలివిజన్ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నీతి టేలర్, దక్షిణాదిలో తొలి సినిమా పూర్తి చేసిన తర్వాత మరో చిత్రంలో అవకాశం కల్పిస్తానంటూ సదరు దర్శకుడు సంప్రదించాడని తెలిపారు. అయితే ఆ సినిమాలో అవకాశం కావాలంటే తనతో శారీరక సంబంధం పెట్టుకోవాలని షరతు పెట్టడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తన తల్లికి చెప్పుకుని కన్నీళ్లు పెట్టుకున్నానని, ఆ సమయంలో తల్లి ఇచ్చిన ధైర్యంతో ఆ దర్శకుడి ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. సినిమాల్లో ఇలాంటి పరిస్థితులు ఎదురవడంతో మనస్తాపానికి గురై, తిరిగి టెలివిజన్ రంగంపైనే దృష్టి సారించినట్లు నీతి టేలర్ వివరించారు.



# 'బ్రహ్మముడి' రుద్రాణి అసలు లుక్కు చూశారా?

**హైదరాబాద్, అక్టోబరు 13 :** బుల్లితెరపై నటీనటులు పోషించే పాత్రలు ప్రేక్షకులకు ఎంతో దగ్గరవుతుంటాయి. ముఖ్యంగా ధారావాహికల్లో ప్రతినాయకులుగా కనిపించే నటీనటులు తమ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటారు. అలాంటి వారిలో నటి షర్మిత గౌడ ఒకరు. తెలుగులో ప్రసారమవుతున్న 'బ్రహ్మముడి' ధారావాహికలో రుద్రాణి పాత్రతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. తెరపై గంభీరంగా, ప్రతికూల ఛాయలున్న పాత్రలో కనిపించే ఈమె.. నిజ జీవితంలో మాత్రం ఆధునిక దుస్తులు, ఆకర్షణీయమైన ఫొటోషూట్లతో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నారు. 'బ్రహ్మముడి' ధారావాహికను క్రమం తప్పకుండా చూసేవారికి షర్మిత గౌడ పేరు సుపరిచితమే. ఇందులో రుద్రాణి పాత్రలో కనిపిస్తూ తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. పాత్రకు తగిన హావభావాలు, సంభాషణలు పలికే తీరు ద్వారా కథలో తన పాత్రకు ప్రత్యేకతను తీసుకొస్తున్నారు. తెరపై ఆమె కనిపించే తీరు, పాత్రలో చూపించే గంభీరత ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ధారావాహికలో సంప్రదాయబద్ధంగా, గంభీరంగా కనిపించే షర్మిత గౌడ.. వ్యక్తిగత ఫొటోల్లో మాత్రం భిన్నమైన శైలిని ప్రదర్శిస్తున్నారు. ఆధునిక దుస్తులు, కొత్త తరహా అలంకరణలు, అందమైన ఫొటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తెరపై రుద్రాణిగా కనిపించే రూపానికి, సామాజిక మాధ్యమాల్లో పంచుకునే చిత్రాల్లోని రూపానికి మధ్య ఉన్న వ్యత్యాసం నెటిజన్లను ఆకర్షిస్తోంది. దీంతో ఆమె తాజా చిత్రాలు అభిమానుల దృష్టిని ఆకట్టుకుంటున్నాయి. షర్మిత గౌడ నటనా ప్రయాణం కన్నడ టెలివిజన్ రంగంలో ప్రారంభమైనట్లు సమాచారం. అక్కడ పలు ధారావాహికల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'గీత' ధారావాహికలో కథానాయకుడి తల్లి పాత్రలో కనిపించి కన్నడ ప్రేక్షకులకు చేరువైనట్లు కథనాలు పేర్కొంటున్నాయి. కుటుంబ కథా ధారావాహికల్లో విభిన్న పాత్రలు పోషించిన ఆమె.. తెలుగులో మాత్రం ప్రతికూల ఛాయలున్న రుద్రాణి పాత్రతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇక షర్మిత వ్యక్తిగత జీవితం, కుటుంబ వివరాల గురించి తెలుసుకోవడానికి కూడా అభిమానులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఆమె వయసు, పుట్టిన తేదీ వంటి వివరాలపై స్పష్టమైన ధ్రువీకరణ లేని సమాచారాన్ని నిజమని భావించకూడదు. ఏదేమైనా, తెరపై పాత్రకు తగ్గట్టుగా నటిస్తూ, బయట తనదైన శైలితో అభిమానులను ఆకట్టుకుంటున్న షర్మిత గౌడ బుల్లితెర ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com